

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 05 మే 2021 సంపుటి : 02 సంచిక : 294 పేజీలు : 4 వెల : రూ 3-00

## తిరుమల అగ్ని ప్రమాదంలో వ్యక్తి సజీవ దహనం

తిరుమల తిరుమలలో దుకాణాల వద్ద మంగళవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో భారీగా ఆస్తినష్టం వాటిల్లింది.శ్రీవారి ఆస్థాన మండపం వద్ద ఉన్న దుకాణాల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 20 దుకాణాలు దగ్ధమ య్యాయి. మంటల ధాటికి దుకాణా ల్లోని వస్తువులు కాలిపోయాయి. ఈ క్రమంలో దుకాణాల్లోని శకలాలను తొలగిస్తుండగా ఓ వ్యక్తి మృతదేహం బయటపడింది. అగ్నిప్రమాదంలో దుకాణదారుడు సజీవదహనమైనట్లు పోలీసులు తెలిపారు. ఆస్థాన మండపంలోని షాపు 84లో ఈ మృతదేహాన్ని గుర్తించారు. కాగా, అగ్ని ప్రమాదం ఎలా సంభవించిం దో తెలియాల్సి ఉంది. ప్రమాదం వల్ల జరిగిన నష్టాన్ని అగ్నిమాపక, టీటీడీ విజిలెన్స్ సిబ్బంది అంచనా వేస్తున్నారు.

# దేశంలో ఆగని కరోనా ఉధృతి

### 2కోట్ల మార్కును దాటిన కేసుల సంఖ్య
### కొత్తగా 3,57,229 పాజిటివ్ కేసులు నమోదు
### అమెరికా తరవాత అత్యధిక కేసులు మనవద్దే




న్యూఢిల్లీ,మే4 : దేశంలో కరోనా పాజిటివ్ కేసులు రెండు కోట్ల మార్క్‌ను దాటగా.. వరుసగా మూడో రోజు కేసులు కాస్త తగ్గాయి. 24 గంటల్లో 3,57,229 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని కేంద్రం కుటుంబ ఆరోగ్యమంత్రిత్వ శాఖ మంగళవారం తెలిపింది. కొత్తగా 3,449 మంది మహమ్మారి బారినపడి ప్రాణాలు విడిచారు. తాజాగా 3,20,289 మంది కోలుకొని డిశ్చార్జి అయ్యారు. కొత్తగా నమోదైన కేసులతో దేశంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 2,02,82,833కు పెరిగింది. ఇప్పటి వరకు 1,66,13,292 మంది కోలుకున్నారు. మహమ్మారి బారినపడి మొత్తం 2,22,408 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం దేశంలో 34,47,133 యాక్టివ్ కేసులున్నాయని ఆరోగ్యశాఖ తెలిపింది. ఇప్పటి వరకు టీకా డ్రైవ్‌లో భాగంగా 15,89,32,921 డోసులు పంపిణీ చేసినట్లు వివరించింది. నిన్న ఒకే రోజు 16,63,742 టెస్టులు చేసినట్లు ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ ఐసీఎంఆర్ తెలిపింది. ఇప్పటి వరకు 29.33 కోట్ల పరీక్షలు చేసినట్లు చెప్పింది. ఇదిలా ఉండగా.. ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసుల్లో అమెరికా తర్వాత భారత్‌లోనే రెండు కోట్ల కేసులు నమోదయ్యాయి. ఇదిలావుంటే ప్రాణాంతక కరోనా సెకెండ్ వేవ్‌ను అదుపు చేసేందుకు దేశవ్యాప్త లాక్‌డౌన్ విధించాలని ఆల్ ఇండియా ట్రేడర్స్ కాన్ఫెడరేషన్ (సీఏఐటీ) కోరింది. తమ ఆన్‌లైన్ సర్వేలో పాల్గొన్న 67 శాతం మంది కరోనా చైన్‌ను అడ్డుకునేందుకు దేశవ్యాప్త లాక్‌డౌన్‌కు అనుకూలంగా స్పందించినట్టు తెలిపింది. తక్షణమే దేశవ్యాప్త లాక్‌డౌన్ అమలు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని సీఏఐటీ జాతీయ అధ్యక్షుడు బీఎస్ భరటియా, సెక్రటరీ జనరల్ ప్రవీన్ ఖండేల్వాల్ కోరారు. దేశవ్యాప్త లాక్‌డౌన్ సాధ్యం కాని పక్షంలో కేవిడ్ కేసులు గణనీయంగా పెరుగుతున్న రాష్ట్రాల్లో పూర్తి లాక్‌డౌన్‌కు తాము సిఫారసు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం దేశవ్యాప్త లాక్‌డౌన్ ప్రకటిస్తే గత ఏడాది తరహాలోనే నిత్యావసరాల సరఫరా, లభ్యత సక్రమంగా జరిగేలా తాము చూస్తామని సీఏఐటీ భరోసా ఇచ్చింది.'వాణిజ్య వర్గాలే కాదు, ప్రజలు కూడా దేశవ్యాప్తంగా పెరుగుతున్న కరోనా కేసుల భయంలో చిక్కు కున్నారు. వైద్య వ్యవస్థ కుప్పకూలింది. సమస్య తీవ్రతను పరిగణనలోకి తీసుకుని సీఏఐటీ ఆన్‌లైన్ సర్వే జరిపింది. దేశవ్యాప్త లాక్‌డౌన్ విధించాలని, ఢిల్లీలో కోవిడ్ ఆపరేషన్ల పర్యవేక్షణకు ఒక కేంద్ర మంత్రిని నోడల్ ఆఫీసర్‌గా నియమించాలని మెజారిటీ వ్యక్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు' అని సీఏఐటీ తెలిపింది. తమ సర్వేలో దేశవ్యాప్తంగా 9,117 ట్రేడర్లు పాల్గొన్నారని, 78.2 శాతం ఇండియాలో కోవిడ్ పరిస్థితి అదుపుతప్పిందని అభిప్రాయపడగా, 67 శాతం మంది పాన్-ఇండియా (దేశవ్యాప్త) లాక్‌డౌన్‌కు సూచించారని పేర్కొంది.

# వ్యాక్సిన్‌పై ప్రధానికి లేఖ రాయనున్న సీఎం జగన్



విజయవాడ: వాక్సినేషన్‌పై ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లేఖ రాయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. 45 ఏళ్లు పైబడిన వారికి వాక్సినేషన్‌లో ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రిమండలి నిర్ణయించింది. ఈ విషయమై ప్రధానికి సీఎం జగన్ లేఖ రాయనున్నారు. మంగళవారం సీఎం అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కరోనా కట్టడి చర్యలు.. వ్యాక్సినేషన్‌పై ప్రధానంగా చర్చించారు. ఆక్సిజన్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రిమండలి నిర్ణయించింది. కర్ణాటక, ఒరిస్సా, తమిళనాడు నుంచి ఆక్సిజన్ రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ ఆదేశించారు. రేపటి నుంచి కర్ఫ్యూను పకడ్బందీగా అమలు చేయాలని నిర్ణయించారు. 12 గంటల తర్వాత ఆర్టీసీ బస్సులు నడవకూడదని నిర్ణయించారు. ఉదయం 11.30 గంటల వరకే కళాశాలల నిర్వహణకు అవకాశం ఇచ్చారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకే దుకాణాలకు అనుమతి ఇవ్వాలని.. మధ్యాహ్నం నుంచి ప్రజా రవాణా వాహనాలను నిలిపేయాలని మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 12గంటల తర్వాత ఆర్టీసీ బస్సులు, అంతర్రాష్ట్ర సర్వీసులు నిలిచిపోనున్నాయి.

## జేఈఈ మెయిన్స్ పరీక్షలు వాయిదా



న్యూఢిల్లీ : కరోనా తీవ్రత దృష్ట్యా మరో జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష వాయిదా పడింది. జేఈఈ మెయిన్స్ 2021 పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) మంగళవారం ప్రకటించింది. మే 24, 25, 26, 27, 28 తేదీల్లో నిర్వహించాల్సిన మెయిన్స్ పరీక్షలను వాయిదా వేస్తున్నామని తెలిపింది. ఏప్రిల్ సెషన్ కూడా వాయిదా పడిన విషయం తెలిసిందే. కరోనా విజృంభణ నేపథ్యంలో ఏప్రిల్ 27, 28, 30 తేదీల్లో జరగాల్సిన జేఈఈ మెయిన్స్ పరీక్షలను కూడా వాయిదా వేశారు.

## ఇవన్నీ పనికి రావు.. సంపూర్ణ లాక్‌డౌనే ఏకైక మార్గం

### కర్ఫ్యూ, పాక్షిక లాక్‌డౌన్ పనికిరాదు
### కరోనా మూడో వేవ్‌పై ఎయిమ్స్ హెచ్చరిక
### మహమ్మారిపై ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రణ్‌దీప్ గులేరియా వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: రోజురోజుకు పెరుగుతున్న కరోనా వైరస్ కేసులు, మరణాలతో భారతదేశం ఉక్కిరిబిక్కిరవుతోంది. ప్రజలు పెద్ద ఎత్తున అనారోగ్యం బారిన పడుతుండడంతో భారతదేశం తల్లడిల్లుతోంది. ప్రస్తుతం కరోనా కట్టడికి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు ఏమాత్రం ఫలించడం లేదు. ఇదే విషయాన్ని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) డైరెక్టర్ డాక్టర్ రణ్‌దీప్ గులేరియా తెలిపారు. ప్రస్తుత కట్టడి చర్యలు కరోనాను ఏమాత్రం నియంత్రించలేదని హెచ్చరించారు. రాత్రిపూట కర్ఫ్యూ, వారాంతపు లాక్‌డౌన్‌తో ఎలాంటి ప్రయోజనం లేదని.. కరోనా వ్యాప్తిని అడ్డుకోలేదని స్పష్టం చేశారు. కరోనా మూడో వేవ్‌కు సిద్ధంగా ఉండాలని ఎయిమ్స్ డైరెక్టర్ రణ్‌దీప్ గులేరియా ఈ సందర్భంగా అప్రమత్తం చేశారు. సంపూర్ణ లాక్‌డౌనే ఏకైక పరిష్కారం అని స్పష్టం చేశారు. కరోనా కేసులు తగ్గేందుకు లాక్‌డౌనే ఉత్తమ మార్గమని పునరుద్ఘాటించారు. మంగళవారం ఓ జాతీయ మీడియాతో గులేరియా మాట్లాడుతూ.. కరోనా వ్యాప్తిపై కీలక వ్యాఖ్యలు చేశారు. కరోనా కట్టడికి మూడు మార్గాలు ఆయన సూచించారు. ఒకటి: ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పన పెంచాలి. రెండోది: ఉప్పెనలా దూసుకురాబోతున్న మూడో వేవ్ కట్టడికి వ్యాక్సిన్లు వేయడం పెంచాలి.మూడోది: ప్రజల మధ్య దూరం పెంచాలి. ఒకచోట ఉండకుండా చూసుకోవాలి. ఈ చర్యలు తీసుకుంటే కేసులు తగ్గేందుకు ఆస్కారం ఉందని డాక్టర్ రణ్‌దీప్ గులేరియా తెలిపారు. 'ప్రజల ఆరోగ్య దృష్ట్యా పాలకులు లాక్‌డౌన్‌లాంటి చర్యలు తీసుకోవాలి. కొన్ని ప్రాంతాలకే లాక్‌డౌన్ పరిమితమైతే అమెరికా మాదిరి మన దేశంలో పరిస్థితి ఉంటుంది. లాక్‌డౌన్ లాంటి నిర్ణయం తీసుకుంటూనే ప్రజలకు నిత్యావసరాలతో పాటు రోజువారీ కార్మికుల గురించి కూడా ఆలోచన చేయాలి. నిర్ణీత కాలం పాటు లాక్‌డౌన్ విధించాలి. కనీసం రెండు వారాలైనా సంపూర్ణ లాక్‌డౌన్ ప్రకటించాలివ అని పేర్కొన్నారు.

## ఆర్టీఐ కమిషనర్లుగా కాకర్ల చెన్నారెడ్డి, ఉల్చాల హరిప్రసాద్




అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లుగా ఉల్చాల హరిప్రసాద్, కాకర్ల చెన్నారెడ్డిని నియమించారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో హరిప్రసాద్, చెన్నారెడ్డి పేర్లను ఖరారు చేసి గవర్నర్ ఆమోదానికి పంపారు. రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం అమలును వీరు పర్యవేక్షిస్తారు.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ నుంచి హిస్టరీలో మాస్టర్స్ డిగ్రీ పొందారు ఉల్చాల హరిప్రసాద్. రెండు దశాబ్దాలుగా పత్రికారంగంలో కొనసాగారు హరిప్రసాద్. పోస్ట్ గ్రాడ్యుయేట్, లాలో గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన కాకర్ల చెన్నారెడ్డి తెలుగు రా(ష్టాల హైకోర్టులో 15 ఏళ్లుగా న్యాయవాదిగా కొనసాగుతున్నారు.

## కరోనా కేసులపై ఏపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

అమరావతి: ఏపీలో కరోనా సెకండ్ వేవ్ కేసులు, మరణాలు పెరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రోజుకూ15 వేలకు పైగా కరోనా పాసిటీవ్ కేసులు వస్తున్నాయి. అయితే పెరుగుతున్న కరోనా కేసులపై గుంటూరుకు చెందిన సామాజిక కార్యకర్త తోట సురేష్ బాబు, ఏపీసీఎల్ఏ హైకోర్టులో పిల్ వేశారు. రాష్ట్రంలో ప్రజలకు అందుతున్న కొవిడ్ ట్రీట్‌మెంట్‌పై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం విచారణ జరిపింది. కొవిడ్ కేసులు పెరిగితే ఎలాంటి చర్యలు తీసుకుంటారని ఏపీ ప్రభుత్వాన్ని హైకోర్టు విచారించింది.ఆక్సిజన్ అందక చనిపోతే పరిస్థితి ఏమిటని ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. కొవిడ్ నియంత్రణ చర్యలపై ప్రభుత్వానికి సీజే బెంచ్ సూచనలు చేసింది. గత విచారణలో ప్రస్తావించిన ఆక్సిజన్, పడకలు, ఔషధాలు, కొవిడ్ పరీక్షల ఫలితాలు , వ్యాక్సినేషన్ వంటి పలు కీలకమైన అంశాలపై గంటన్నరకు పైగా హైకోర్టు విచారణ చేసింది. మృతులకు గౌరవ ప్రదంగా దహన సంస్కారాలు నిర్వహించాలని సూచించింది. గురువారం లోపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి వివరాలు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది.




## వారి ఆరోగ్యం క్షీణిస్తే ప్రభుత్వానిదే బాధ్యత: నారా లోకేష్

అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, వైసీపీపై తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం లోకేష్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలు కరోనాకి వదిలి, ప్రతిపక్షంపై కక్ష సాధిస్తోన్న దేశంలో ఏకైక ముఖ్యమంత్రి మూర్ఖపురెడ్డి అని విమర్శించారు. పేషెంట్లకు ఆక్సిజన్ అందించడం మానేసి టీడీపీపై ఆధిపత్యం సాధించేందుకు జగన్‌రెడ్డి తాడేపల్లిలో వ్యూహరచన చేస్తున్నారని నారా లోకేష్ ధ్వజమెత్తారు.రాజధానిపై వైసీపీ కుట్రలను బట్టబయలు చేశారనే కక్షతో సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రని అక్రమంగా అరెస్ట్ చేయించారని మండిపడ్డారు. సంగం డెయిరీ ఎండీ గోపాలకృష్ణన్‌కు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణగా తేలిందన్నారు. ధూళిపాళ్ల నరేంద్ర కోవిడ్ లక్షణాలతో బాధపడుతున్నారని చెప్పారు. వీరిద్దరినీ ఆస్పత్రికి తరలించకుండా ఏంటీ శాడిజం మూర్ఖపురెడ్డి అని లోకేష్ ప్రశ్నించారు. తక్షణమే నరేంద్ర, గోపాలకృష్ణన్‌లకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. వారి ఆరోగ్యం క్షీణిస్తే ప్రభుత్వానిదే బాధ్యత అని లోకేష్ పేర్కొన్నారు.



## ఏపీలో జూ పార్క్‌లు మూసివేత

### కరోనా వ్యాప్తి నేపథ్యంలో అటవీశాఖ ఆదేశాలు
### ఎకో టూరిజం సెంటర్లు, టెంపుల్ ఎకో పార్క్‌లు మూసివేత




విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో కరోనా మహమ్మారి విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో అన్ని జూ పార్క్‌లు మూసివేస్తున్నట్లు అటవీశాఖ ప్రకటించింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. జూ లతో పాటు ఎకో టూరిజం సెంటర్లు, టెంపుల్ ఎకో పార్క్‌లు మూసివేయాలని నిర్ణయించింది. జూ పార్క్‌ల్లో జంతువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అటవీశాఖ ఆదేశించింది.

ఏపీలో రేపటి నుంచి కర్ఫ్యూ..

కోవిడ్ వ్యాప్తి నియంత్రణలో భాగంగా రేపట్నుంచి రాష్ట్రంలో కర్ఫ్యూ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజలు ఇబ్బంది పడకుండా నిత్యావసరాలు కొనుగోలు చేసేందుకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 144 సెక్షన్ అమలు చేస్తూ సడలింపు కల్పిస్తారు. ఆ సమయంలో ఐదుగురికి మించి గుమికూడరాదు. మధ్యాహ్నం 12 తరువాత షాపులన్నీ తప్పనిసరిగా మూసివేయాలి. అత్యవసరాలకు మాత్రం మినహాయింపు ఉంటుంది

# సంపాదకీయం

బుధవారం 05 మే 2021


## సెకండ్ వేవ్ ను లైట్ గా తీసుకున్నారే

ప్రస్తుతం ఎక్కడ విన్నా ఒక్కటే మాట ఆక్సిజన్.. ఆక్సిజన్.. ఆక్సిజన్ కొరత.. కరోనా మొదటి వేవ్ లో అయితే మనకు ఎదురైన ప్రధాన సమస్యలు ఔషధాలు బెడ్స్ కొరత ..ఆ సమయంలో అందరి దృష్టి శుచి శుభ్రత పోషకారం పైనే ఉండేది కానీ రెండవ వేవ్ లో మాత్రం ఆక్సిజన్ ఆక్సిజన్ అనే మాటలే మార్మోగుతు న్నాయి. మొదటి వేవ్ లో ఆక్సిజన్ అవసరం 41 శాతంగా ఉంటే రెండవవేవ్‌లోఇది 54.5 శాతానికి చేరుకుందని నీతి ఆయోగ్ కూడాపేర్కొంది.దీనిని బట్టి ప్రాణవాయువు డిమాండ్ మనకు అర్ధం అవుతూ ఉంది.అయితే మన దేశంలో ఆక్సిజన్ కొరతకు ఆక్సిజన్‌ఉత్పత్తి లేకకాదు..పంపిణీనేప్రధాన సమస్యగా మారింది. .2017 వరకు ద్రవరూప ఆక్సిజన్ ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారత్ అగ్రగామిగా ఉంది.అయితే క్రమేపీ వైద్య మరియు పారిశ్రామిక అవసరాలు పెరిగిపోవడంతో ఆక్సిజన్ ఎగుమతులపై ప్రభుత్వం కొద్ది అంక్షలు కూడా విధించడం జరిగింది.అయితే గతసంవత్సరంమాత్రం ఒకే సారి వీటి ఎగుమతులను పెంచేసింది. గత సంవత్సరం మొదటి వేవ్ కోవిడ్ అనుభవాలు పొరుగు దేశాల్లోసెకండ్‌వేవ్ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని వ్యవహరిస్తే ఈ దయనీయ పరిస్థితి వచ్చి ఉండేది కాదు అని విమర్శకులు పేర్కొంటున్నారు..సరైన వ్యూహంతో గత సంవత్సరం నుండి ముందుకు వెళ్లి ఉంటే ఈ విపత్తును చాలా వరకూ అధిగమించి ఉండే వాళ్ళం.ఈ క్లిష్ట సమయంలో ఆక్సిజన్ కోసం దేశంలో ప్రతీ రాష్ట్రం ఎదురు తెన్నులు చూస్తూ ఉంటే కేరళ రాష్ట్రం మాత్రం ఆక్సిజన్ కోసం ఎదురు చూడలేదు. తాను ఉత్పత్తి చేసిన దానిలో రాష్ట్ర అవసరాలు తీరగా తిరిగి తమిళనాడు మరియు కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ ఉంది దీనికి గల కారణం.ప్రస్తుతం కోవిడ్ విషయంలో సమస్య అంతా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కనుక దాదాపు ప్రతీ ఇంటిలో ఆక్సి మీటర్ ఏర్పాటు చేసుకుంటు న్నారు. దాని ద్వారా తరచు ఆక్సిజన్ శాతం చూడటం ఏ మాత్రం అనుమానం ఉన్నా ఆక్సిజన్ కోసం హాస్పిటల్ కు పరుగులు తీయడం చేస్తున్నారు..ఆక్సి మీటర్ లో సాంకేతిక లోపాలు వలన కానీ దానిలో బాటరీలు అయిపోయినప్పుడు కానీ ఆక్సిజన్ క్షీణించినట్లుగా ఫలితం వస్తుంది.ఆ సమయంలో ఆందోళన పెరిగి ఊపిరి తీసుకోవడం మరింత కష్టమై ప్రాణాలను పోగొట్టుకున్న వారు కూడా అనేకులు ఉన్నారు.ఈ రూపంలో ప్రభుత్వ లెక్కల లోనికి రాని మరణాలు కూడా అనేకం ఉన్నాయి. దేశ వ్యాప్తంగా ఉక్కు పరిశ్రమలు, చమురు శుద్ధి కర్మాగారాలు తమ ప్లాంట్ల ద్వారా నిరంతరం ఆక్సిజన్ ఉత్పత్తి చేస్తున్నాయి. అయితే, ఆక్సిజన్ సరఫరా చేయడానికి తగినంత ట్యాంకర్లు లేవు. చాలా ప్లాంట్లు తూర్పు భారతదేశంలో ఉన్నాయి. పశ్చిమాన ఒక ఆక్సిజన్ ప్లాంట్ కూడా లేదు. తగినంత ఆక్సిజన్ లభ్యత ఉన్నప్పటికీ, రవాణా ఒక పెద్ద సవాలుగా మిగిలిపోయింది.ఆక్సిజన్ పంపిణీకి అవసరమైన రోడ్ ట్యాంకర్లు, స్టోరేజీ ట్యాంకు లు, సిలిండర్లు సమకూర్చుకోవడం అసలు సమస్య. ఇవన్నీ చాలా ఖర్చుతో కూడినవి. ఒక సిలిండర్ ఆక్సిజన్ ధర రూ.300 వరకు ఉంటుంది.కానీఆక్సిజన్ రవాణాకుకంపెనీలుఉపయోగించే ట్యాంకర్ ధర సుమారు రూ.45 లక్షలు, ఖాళీ సిలిండర్ ధర రూ.10వేలు వరకుఉంటుంది.అందువల్ల ఆక్సిజన్‌ఉత్పత్తి కంపెనీ లు సాధారణ పరిస్థితుల్లోఅవసరమైనమేరకేవీటిని సమకూర్చుకొంటాయి.పెట్రోల్, డీజిల్, ఎల్పీజీలను పైప్‌లైన్ల ద్వారా వేల కిలోమీటర్లు రవాణా చేస్తున్నారు,అలాగే ఆక్సిజన్‌ను కూడా అలా చేరవేయగలగితే అసలు సమస్యే ఉత్పన్నం కాదు.దీనిని దృష్టిలో ఉంచుకుని కేంద్రం చేసిన విజ్ఞప్తి మేరకు రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డి. ఆర్.డీ.ఓ)మెడికల్ ఆక్సిజన్ తయారీకి టెక్నాలజీని అభివృద్ధి చేసింది.ఈ టెక్నాలజీలో వాతావరణంలోని గాలిని పీల్చుకుని జియోలైట్ పదార్థం సహాయంతో అందులోని ఇతర వాయువులను తొలగించి 93 శాతం గాఢతలో ఆక్సిజన్ ను వేరు చేస్తాయి. దీనిని నేరుగా రోగులకు అందించవచ్చని పరిశోధకులు చెబుతున్నారు ఎక్కడికక్కడ ప్రతీ హాస్పిటల్ లో ఇటువంటి టెక్నాలజీ ఉపయోగించుకోగలిగితే ఆక్సిజన్ కొరత అంతర్ధానం అవుతుంది..అయితే ఎత్తైన ప్రదేశాలలో ఉండే హాస్పిటల్ లో ఈ టెక్నాలజీ సౌకర్యవంతంగా ఉంటుందని చెబుతున్నారు..దేశ వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని 500 వరకు ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు సిద్ధం అయినట్లు డీ.ఆర్.డీ.ఓ తెలియచేసింది.. దీని ద్వారా పంపిణీ సమస్యను చాలా వరకు అధిగమించి సత్వరమే ఆక్సిజన్ అందించడానికి ఎంతగానో వీలు పడుతుంది.ఆక్సిజన్ లభించక పోవడం వలన ప్రతీ నిత్యం మరణాలు. ప్రతీ హాస్పిటల్ వద్ద ఆక్సిజన్ లభించక సంభవించే ఇటువంటి మరణాలును పత్రికలలో పతాక శీర్షికలలో వార్తలు రూపంలో వస్తూ ఉండగా టీవీలలో సామాజిక మాధ్యమాలలో ఇవే వార్తలు ఇవే చర్చలు పదే పదే కొనసాగుతూ ఉన్నాయి?దీనివలన కోవిడ్ బాధితులే కాదు కోవిడ్ సోకని వారు కూడా ముందు ముందు మనకు కోవిడ్ సోకినా ఆక్సిజన్ లభించకపోతే అదే విధమైన పరిస్దితి ఎదురవుతుందేమో అనే తీవ్ర ఆందోళన ప్రతీ ఒక్కరిలో చోటు చేసుకుంటూ ఉంది..చాలా మంది ఈ రూపేణా ప్రాణాలు కోల్పోయిన వారు ఉన్నారు.దేశ రాజధానిలో సైతం ఆక్సిజన్ అందక మరణించిన వారు అనేకులు.ఒక వేళ ఆక్సిజన్ దొరికినా కూడా 150 రూపాయిల సిలండర్6 వేలరూపాయిలు పలుకుతోంది సామాన్యు లు వాపోతు న్నారు.కొరత అనే మాట వ్యాపించగానే బ్లాక్ మార్కెట్ అనేది మరింత విస్తృతం అయిపోయింది.భాగ్యవంతులు మాత్రం ఈ పరిస్థితిని గమని ంచి ముందుగానే ఆక్సిజన్ కాంసెంట్రేటర్ మిషన్లు కొనుగోలు చేసి ఇంటిలో పెట్టుకుంటున్నారు. హోమ్ ఐసోలేషన్‌లో ఉన్న వాళ్ళు మరియు ప్రైవేట్ వైద్యశాలలు కూడా కొనుగోలు ఆరంభించే సరికి వీటి ధర కూడా కొండెక్కడం జరిగింది. కొందరు అయితే అద్దె ప్రాతిపదికపై వీటిని తీసుకుం టున్నారు.మొదటి వేవ్ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని దాదాపు నూరు శాతం ఆక్సిజన్ ఉత్పత్తులపై దృష్టి పెట్టడం వల్లనే అది సాధ్యం అయ్యిందని కేరళ ప్రభుత్వం చెబుతూ ఉంది.

## రెడీ అవుతున్న రెండు ఆక్సిజన్ ప్లాంట్లు

అనంతపురం, మే 4, (న్యూస్ పల్స్)కోవిడ్ ఉగ్రరూపం దాలుస్తున్న నేపథ్యంలో ఆక్సిజన్ కొరత దేశ వ్యాప్తంగా వణుకు పట్టిస్తున్నా.. జిల్లాలో అధికార యంత్రాంగం చేపట్టిన ముందుజాగ్రత్త చర్యలు ఫలితాలనిస్తోంది. శింగనమలలోని లైఫ్ ఆక్సిజన్ ప్లాంటుతో పాటు హిందుపురం నియోజకవర్గంలో తూముకుంట వద్ద ఉన్న సాయికృష్ణ ఆక్సిజన్ గ్యాసెస్ ప్లాంటులో ఆక్సిజన్ ఉత్పత్తికి అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ గంధం చంద్రుడు గుర్తించారు. అయితే ఈ రెండు ప్లాంట్లలో ఉత్పత్తికి ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆగమేఘాల మీద అనుమతులు మంజూరు చేయించారు. తద్వారా ఈ రెండు ప్లాంట్లలో ఏకంగా ప్రతి రోజూ 700 సిలిండర్ల మేర ఆక్సిజన్ ఉత్పత్తికి అవకాశం ఏర్పడిందని కలెక్టర్ గంధం చంద్రుడు తెలిపారు.వాస్తవానికి ఏదైనా ప్లాంటులో ఆక్సిజన్ ఉత్పత్తి కోసం ఔషధ నియంత్రణ శాఖ నుంచి అనుమతి(ఫారం?25) అవసరం. అంతేకాకుండా ఆక్సిజన్ రవాణా కోసం కూడా అదే శాఖ నుంచి అనుమతి తప్పనిసరి. అయితే శింగనమలలోని లైఫ్ ఆక్సిజన్ ప్లాంటుకు ఈ అనుమతులు లేవు. ఫలితంగా సదరు కంపెనీ ఆక్సిజన్ ఉత్పత్తిని నిలిపేసింది. విషయం తెలుసుకున్న కలెక్టర్ గంధం చంద్రుడు వెంటనే ఔషధ నియంత్రణశాఖ అధికారులతో మాట్లాడటంతో పాటు అనుమతుల కోసం సదరు కంపెనీతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించారు. వెంటనే అనుమతులు వచ్చేలా కృషి చేశారు. ఆ మేరకు ప్లాంటులో 300 సిలిండర్ల మేర ఉత్పత్తి అయ్యే ఆక్సిజన్‌లో 150 నుంచి 200 సిలిండర్లు జిల్లా ఆసుపత్రులకు సరఫరా చేసేందుకు కంపెనీ అంగీకరించింది.తూముకుంట వద్దనున్న సాయికృష్ణ ఆక్సిజన్ గ్యాసెస్ కంపెనీ చెల్లించాల్సిన విద్యుత్ బకాయిల వల్ల ఈ ప్లాంటులో ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ కంపెనీ చెల్లించాల్సిన సుమారు రూ.19 లక్షల విద్యుత్ బకాయిలను 18 నెలల పాటు వాయిదా వేయాలని సదరు కంపెనీ అభ్యర్థించింది. దీనిపై వెంటనే ఎస్‌పీడీసీఎల్ సీఎండీతో కలెక్టర్ మాట్లాడారు. అంతేకాకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ప్రభుత్వం కాస్త సానుకూలంగా స్పందించినట్టు తెలుస్తోంది. ఇక్కడ రోజుకు 500 సిలిండర్ల మేర ఆక్సిజన్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని అధికారులు గుర్తించారు. అంటే మొత్తంగా ప్రతి రోజూ జిల్లాలోనే ఏకంగా 700 సిలిండర్ల మేర ఆక్సిజన్ అందుబాటులోకి రానుంది. ఇది కాస్తా జిల్లా ప్రస్తుత అవసరాల్లో సగం మేర ఉంటుంది. దేశవ్యాప్తంగా ఆక్సిజన్ కొరత వేధిస్తున్న నేపథ్యంలో జిల్లాలోనే ఆక్సిజన్ ఉత్పత్తికి అవకాశాలను గుర్తించి చర్యలు తీసుకుంటున్న జిల్లా యంత్రాంగంపై ప్రశంసల జల్లు కురుస్తోంది.ప్రభుత్వ ముందుచూపుతో..వాస్తవానికి కోవిడ్ కంటే ముందు జిల్లాలోని ప్రధాన ఆసుపత్రితో పాటు ఎక్కడా కూడా ప్రత్యేకంగా ఆక్సిజన్ నిల్వ కోసం ప్లాంటు లేదు. సరైన ఆక్సిజన్ పైపులైన్లు కూడా లేని దుస్థితి. ఈ పరిస్థితిని గమనించిన ప్రభుత్వం ఆక్సిజన్ నిల్వ ప్లాంటుతో పాటు రోగులకు నేరుగా ఆక్సిజన్ సరఫరా పైపులైన్ల ఏర్పాటుకు ఆగమేఘాల మీద చర్యలు తీసుకుంది. ఇలా ఏకంగా రూ.5 కోట్లకుపైగా నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో జిల్లాలోని అన్ని ఆసుపత్రుల్లో ఆక్సిజన్ నిల్వ ప్లాంటుతో పాటు పైపులైన్లను ఏర్పాటు చేశారు. జిల్లాలో అర్జాస్ స్టీల్ కంపెనీ ఉంది. తన పరిశ్రమ అవసరాల కోసం ఈ కంపెనీ ఆక్సిజన్‌ను నిల్వ ఉంచుకుంది. ఇక్కడ సుమారు 100 టన్నుల ఆక్సిజన్ నిల్వ ఉన్నట్టు తెలుస్తోంది. దీనిపై కూడా జిల్లా కలెక్టర్ ఆరా తీసినట్టు సమాచారం. ఈ ఆక్సిజన్‌ను కూడా ప్రజల అవసరాల కోసం వినియోగించుకునేందుకు ప్రభుత్వం చర్యలను ప్రారంభించింది. రెండు, మూడు రోజుల్లో ఈ ఆక్సిజన్ నిల్వలు కూడా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

## ఉమ్మడి వ్యూహానికి బాబు ప్లాన్



విజయవాడ, మే 4, (న్యూస్ పల్స్) తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఈసారి ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే అవకాశం లేదు. అలాగని బలహీనమైన కమ్యినిస్టు పార్టీలతో కలసి కూడా ఆయన ప్రయాణించరు. ఇటీవల సీపీఐ టీడీపీ పట్ల కొంత సానుకూలంగా ఉన్నప్పటికీ చంద్రబాబు చివరి నిమిషంలో వామపక్ష పార్టీలను పక్కన పెట్టే అవకాశముంది. మరోసారి బీజేపీ, జనసేన, టీడీపీ కలసి పోటీ చేస్తేనే విజయం దక్కుతుందని ఆయన భావిస్తున్నారు.అందుకోసం చంద్రబాబు ఇప్పటి నుంచే కొంత ప్రిపేర్ అవుతున్నట్లు కన్పిస్తుంది. నియోజకవర్గాల ఇన్ ఛార్జుల విషయంలోనూ చంద్రబాబు సీరియస్ గా లేకపోవడానికి కారణమిదేనంటున్నారు. బీజేపీ, జనసేనతో కలసి పోటీ చేస్తే దాదాపు యాభైకి పైగా స్థానాలను టీడీపీ వదులుకోవాల్సి ఉంటుంది. అంటే దాదాపు వంద స్థానాల్లోనే తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు పోటీ చేయాల్సి ఉంటుంది. ఇందుకు అనుగుణంగానే చంద్రబాబు ఇటీవల నిర్ణయాలు ఉన్నాయంటున్నారు.ఇప్పటికే చంద్రబాబు సర్వే చేయాలని ఒక ప్రయివేటు సంస్థకు అప్పగించారని తెలుస్తోంది. మూడు పార్టీలు కలిస్తే విజయం సాధించే నియోజకవర్గాలపై ఈ సర్వే చంద్రబాబు స్పెషల్ గా చేయిస్తున్నారని తెలిసింది. నేతలు రెండేళ్ల నుంచి యాక్టివ్ గా లేకపోవడం, వారిని చంద్రబాబు పట్టించుకోక పోవడం కూడా ఇదే కారణమని చెబుతున్నారు. బీజేపీతో సయోధ్య కోసం ఇప్పటికే ఢిల్లీలో లాబీయింగ్ ను చంద్రబాబు ప్రారంభించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.జగన్ ను వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా ఎదుర్కొనలేమని చంద్రబాబుకు తెలియంది కాదు. అయితే బీజేపీ తనను దగ్గరకు రానివ్వకుండా కొందరు రాష్ట్ర నేతలు అడ్డుకుంటున్నారు. వీరిని పక్కన పెట్టి నేరుగా ఢిల్లీ నేతలతోనే చంద్రబాబు టచ్ లోకి వెళ్లారంటున్నారు. చంద్రబాబుకు చెందిన ఒక టీం ఇప్పటికే ఢిల్లీలో ప్రయత్నాలు ప్రారంభించిందట. అన్నీ వీలయితే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత చంద్రబాబు ఢిల్లీ టూర్ ఉండే అవకాశముందని కూడా తెలుస్తోంది. మొత్తం మీద చంద్రబాబు జగన్ పై పోరాటానికి ఉమ్మడి వ్యూహాన్ని సిద్ధం చేశారంటున్నారు.

## బీజేపీ, జనసేన అట్టర్ ఫ్లాప్ షో




తిరుపతి, మే 4, (న్యూస్ పల్స్) రుపతిలో జనసేన, బీజేపీ అట్టర్ ఫ్లాప్ షో చూపింది. ఎలాంటి ప్రభావం చూపలేకపోయింది. హమ్మ.. ఎంత బిల్డప్ ఇచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉందన్న ఏకైక కారణంతో రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీని కూడా ఇబ్బందులు పెట్టాలని చూశారు. ఆలయాల్లో దాడుల ఘటన అయితేనేమి? తిరుపతిలో అన్యమత ప్రచారం జరు?గుతుందని, మత మార్పిడులు రాష్ట్రంలో ఇలా ఒక్కటమేటి అన్ని రకాలుగా బీజేపీ వైసీఎని డ్యామేజ్ చేయడానికి ప్రయత్నించింది.కానీ బీజేపీ పప్పులు తిరుపతి ఉప ఎన్నికల్లో ఉడక లేదు. తాము, జనసేన కలిస్తే ఒక ఊపు ఊపేస్తామని చెప్పింది. రాజధాని అమరావతి అంశాన్ని కూడా తమకు అనుకూలంగా వాడుకోవాలని చూసింది. ఇక తిరుపతి లో దొంగఓట్లు పోల్ చేయించిందని వైసీపీపై యాగీ యాగీ చేసింది. తమ పార్టీ అభ్యర్థి గెలిస్తే కేంద్రమంత్రి పదవి లభిస్తుందని కూడా ప్రచారం చేసింది. అయినా తిరుపతిలో ప్రజలు బీజేపీ, జనసేనలను పూర్తిగా పక్కన పెట్టాయి.జనసేన అధిపతి పవన్ కల్యాణ్ పాత విమర్శలనే చేశారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్యను గుర్తు చేశారు. జనసేన క్యాడర్ అంతా రత్న ప్రభకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. బహిరంగ సభ ద్వారానే కాకుండా పవన్ కల్యాణ్ తిరుపతి ప్రజలకు లేఖ కూడా రాశారు. అయినా పెద్దగా ఓట్లు రాలేదు. బీజేపీ అయితే కేంద్ర మంత్రులను రంగంలోకి దించింది. జాతీయ పార్టీ అధ్యక్షుడు జేపీనడ్డా కూడా ప్రచారానికి వచ్చారు. తిరుపతి ఉప ఎన్నిక ప్రభావం బీజేపీ, జనసేన కూటమిపై భవిష్యత్ లో జరగబోయే ఎన్నికలపై కూడా ప్రభావం చూపే అవకాశాలున్నాయిఇక కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ఇక్కడి బీజేపీకి ఇబ్బందికరంగా మారాయి. విశాఖస్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ, పెట్రోల్ ఉత్పత్తులు, గ్యాస్ ధర పెంపు వంటివి తిరుపతి ఎన్నికల్లో కూడా బీజేపీకి శాపంగా మారాయని చెప్పకతప్పదు. అందుకే బీజేపీకి ఇక్కడ 56,820 ఓట్లు మాత్రమే వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వంపై ఇకనైనా విమర్శలు మానుకుని, కేంద్రంలో అధికారంలో ఉన్నారు కాబట్టి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేవిధంగా ప్రయత్నిస్తే బీజేపీ, జనసేనలకు ఏపీ?లో భవిష్యత్ ఉంటుంది. లేకపోతే డిపాజిట్లు కూడా దక్కదు. అందుకే ఇక అధికార పార్టీపై విమర్శలకు ఇక జనసేన, బీజేపీ మాస్క్ వేసుకోవాల్సిందే.

## జగన్ పై గుర్రుగా కొఠియా గ్రామాలు

శ్రీకాకుళం, మే 4, (న్యూస్ పల్స్) ఏపీ సీఎం జగన్ వైఖరిపై ఏవోబీ (ఒడిశా-ఆంధ్ర సరిహద్దు) ప్రాంతంలోని 21 గ్రామాల ప్రజలు నిప్పులు చెరుగుతున్నారు. ఇక్కడి కొఠియా గ్రూప్‌గా పిలుచుకునే ఈ గ్రామాల్లో గిరిజనులు ఎక్కువగా ఉంటున్నారు. వాస్తవానికి ఈ గ్రామాలు.. ఖచ్చితంగా ఒడిశా సరిహద్దులో ఉన్నాయి. దీంతో అనధికారికంగా ఒడిశా ప్రభుత్వ పెత్తనం ఇక్కడ ఎక్కువగా ఉంటోంది. నిజానికి ఇక్కడి గ్రామాల ప్రజలు.. ఒడిశాలోని పలు ప్రాంతాలకు వెళ్లి పనులు చేసుకుంటున్నారు. దీనిని అలుసుగా తీసుకున్న అక్కడి ప్రభుత్వం.. తమ పెత్తనం చెలాయిస్తోంది. కానీ.. ఇక్కడి ప్రజలకు ఓటు హక్కు, ఉపాధి కల్పన, ఇతర సంక్షేమ కార్యక్రమాలు అన్నీ కూడా.. ఏపీ ప్రభుత్వం నుంచే అందుతున్నాయి .అయినప్పటికీ.. ఒడిశా ఆధిపత్యంలోనే ఇక్కడి ప్రజలు మగ్గిపోతున్నారు. ఇటీవల జరిగిన పరిషత్ ఎన్నికలతోపాటు.. పంచాయితీ, స్థానిక ఎన్నికల్లోనూ ఇక్కడి కొఠియా ప్రజలను ఓటు వేయకుండా ఒడిశా అడ్డుకుంది. దీనికి ప్రధాన కారణం.. ఎప్పటికైనా.. తమ పరిధిలోకి ఈ గ్రామాలను కలిపిపేసుకోవడమే. పంచాయతీ ఎన్నికల సమయంలో ఏకంగా ఇక్కడ ఎన్నికలు నిర్వహించరాదని పేర్కొంటూ.. ఒడిశా ప్రభుత్వం.. సుప్రీం కోర్టుకు వెళ్లింది. అయితే.. అప్పటికే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున కొనసాగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే.. పరిషత్ ఎన్నికలకు వచ్చే సరికి అసలు.. ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా ఓటర్లను ఒడిశా బలగాలు అడ్డుకున్నాయి.క్రమంలో అక్కడి ఓటర్లు.. జగన్ సర్కారు తమను ఆదుకోవాలని అభ్యర్థించాయి. కానీ, జగన్ ప్రభుత్వం ఇప్పటి వరకు కూడా పట్టించుకోలేదు. కానీ, ఇప్పుడు 80 టీఎంసీల వంశధార నది నీళ్లను తమకు కేటాయించారని.. సో.. ఈ నీళ్ల విషయంలో అడ్డంకులు సృష్టించవద్దని.. అవసరమైతే.. కలిసి చర్చించుకుందామని.. కోరుతూ.. ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్‌కు సీఎం జగన్ లేక సంధించారు. దీనిపై ఏం జరుగుతుందో తెలియదు కానీ.. కొఠియాలో మాత్రం ఈ లేఖ ప్రకంపనలు సృష్టిస్తోంది.తాము ఎన్నో ఏళ్లుగా ఏపీ ప్రభుత్వానికి ఓట్లు వేస్తున్నామని.. తమకు పెద్ద సమస్యగా మారిన ఒడిశా ప్రభుత్వ పెత్తనంపై ఏపీ సర్కారు ఎందుకు స్పందించడం లేదని ఇక్కడి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జగన్ తమ గురించి స్పందించకుండా ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్‌కు నీళ్ల సమస్య కోసం పరిష్కరించుకుందామని లేఖ రాయడంపై వారు భగ్గుమంటున్నారు. నీళ్ల సమస్య కోసం చర్చలకు వెళ్లడం సమంజసం కాదని వారు వాపోతున్నారు. ఈ వివాదం ముదిరితే.. వారు కనుక ఒడిశాకు అనుకూలంగా మారితే.. ఖచ్చితంగా ఏపీకి తీవ్ర అవమానం ఎదురుకాకతప్పదు. మరి ఏం చేస్తారో చూడాలి.

## తగ్గని చరిష్మా...

తిరువనంతపురం, మే 4, (న్యూస్ పల్స్) పినరయి విజయన్.. దేశ వ్యాప్తంగా మారుమోగిపోతున్న పేరు. పినరయి విజయన్ చరిత్ర తిరగరాశారు. దైవ భూమిగా భావించే కేరళలో వరసగా రెండోసారి విజయం సాధించడం ఒక రికార్డు. ఎన్ని కుట్రలు చేశారు? ఎన్ని కేసులు పెట్టారు? నిజాయితీగా ఉన్న నేతపై తప్పుడు ప్రచారం చేసి గెలవాలనుకున్న వారి చెంపను కేరళ ప్రజలు చెళ్లుమనిపించారు. ఐదేళ్లలో తన చరిష్మా ఏమాత్రం తగ్గలేదని పినరయి విజయన్ మరోసారి నిరూపించారు.కేరళలో అధికార పార్టీ రెండోసారి గెలిచిన దాఖలాలు లేవు. ఆ సంప్రదాయాన్ని పినరయి విజయన్ తిరగరాశారు కమ్యునిస్టు పార్టీలు దేశ వ్యాప్తంగా కనుమరుగవుతున్న తరుణంలో మరోసారి పినరయి విజయన్ ప్రాణం పోశారు. కేరళలో 1977 తర్వాత రెండోసారి అధికారంలోకి రావడం పినరయి విజయన్ మాత్రమే. ఐదేళ్లలో కేరళ ఎంత కష్టాల్లో ఉన్నప్పటికీ పినరయి విజయన్ వెనక్కు తగ్గలేదు. ప్రతిసమస్యను అధిగమించుకుంటూ వచ్చారు.వరదలు, నిఫా వైరస్, కరోనా వైరస్ ఇలా కేరళకు ఏదో ఒక ఇబ్బంది ఎదురవుతూనే ఉంది. కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం లేకపోయినా విజయన్ ఆ సమస్యల నుంచి అధిగమించారు. కరోనా సమయంలోనూ పేదప్రజలకు అండగా నిలబడి మిగిలిన రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆదర్శంగా నిలిచారు. శబరిమల వంటి సున్నిత సమస్యలను కూడా నెమ్మదిగా నరుక్కుంటూ చివరకు పినరయి విజయన్ విజయం సాధించారు.ఆయనపై అవినీతి మచ్చ వేయడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. గోల్డ్ స్కామ్ కేసులో ఆయన పేరు ప్రముఖంగా విన్పించేలా చేశారు. కానీ పినరయి విజయన్ విజయానికి అవేమీ అడ్డంకి కాలేదు. కేరళ ప్రజలు ఆ ప్రచారాన్ని నమ్మలేదు. పైగా ఆయనపై కుట్ర జరుగుతుందని గట్టిగా నమ్మారు. అందుకే ఆయన వెంట నిలిచారు. రెండోసారి కేరళలో విజయం సాధించి పినరయి విజయన్ తాను ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారు. ప్రజల్లో నమ్మకం కలిగిన నేతను ఎవరూ వదులుకోరని మరోసారి నిరూపించారు.

## అక్రమ మద్యం ముఠా ఆరెస్టు

ఒంగోలు ప్రకాశం జిల్లాలో గోవా నుంచి తరలిం చిన అక్రమ మద్యాన్ని విక్రయిస్తున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. గతంలో గోవాలో పనిచేసిన ఓ వ్యక్తి, అక్కడినుంచి జిల్లాకు మద్యాన్ని తీసుకువచ్చి విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు నిందితులను ఎస్ఈబీ అధికారులు పట్టుకున్నారు. ప్రకాశం జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్‌అధికారులుస్వాధీనంచేసుకున్నారు.ఒంగోలు పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు.. పెద్దారవీడు మండలంలో తనీఖీలునిర్వహించారు. ఇందులో భాగంగా.. కర్రోల గ్రామంలోని మిరప పొలాల్లో దాచిఉంచిన 1,175 మద్యం సీసాలతో పాటు 50 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు ఒక ఆటో, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని ఏడుగురిని అరెస్ట్ చేశారు.

## ప్రస్తుత పరిస్థితుల్లో వివాహాలు వాయిదా వేసుకోవాలి

వింజమూరు ప్రస్తుతం కరోనా వ్యాప్తి ఉద్ధృతంగా ఉండడంతో కొంతకాలం వివాహాలను వాయిదా వేసుకోవాలని నెల్లూరు జిల్లా వింజమూరు మండల తాసిల్దార్ ఎన్ వి కే సుధాకర్ రావు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో వివాహాలు జరిగినట్లయితే ఆ వివాహ వేడుకకు అనేక ప్రాంతాల నుండి బంధువుల రాకపోకలు జరుగుతాయన్నారు.. ఈ క్రమంలో ఎవరికో ఒకరికి కరోనా సంక్రమించి నట్లయితే ఇరువర్గాల వారు బాధపడాల్సిన అవసరం ఏర్పడుతుందన్నారు. కనుక ఎవరిలో ఈ వ్యాధి ఉందో తెలియని పరిస్థితి ఉంది కనుక వివాహాల పేరుతో అందరూ కలిసి ఉండడం వల్ల కరోనా వ్యాపించే అవకాశం మెండుగా ఉంటుంది కనుక వివాహం చేసుకోవాలనుకునే వారు ఆలోచించాలని ఆయన తెలిపారు. అదేవిధంగా దేవాలయాల్లో కానీ కళ్యాణ మండపాలలో గాని వివాహాలు జరిపినట్లయితే ఆలయ ధర్మకర్త లపై అలాగే కళ్యాణ మండపం యాజమాన్యంపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కనుక ప్రజలు ఆలోచించి కరోనా తగ్గుముఖం పట్టే వరకు తమ వివాహ వేడుకలను వాయిదా వేసుకోవాల్సి ఉందిగా ఆయన కోరారు.అలాగే మండలంలో ఉన్న ప్రైవేటు వైద్యశాలలో వైద్యులు ప్రస్తుత పరిస్థితులలో కరోనా చికిత్స చేయకూడదని కమాండ్ కంట్రోల్ మరియు తహసిల్దార్ ఎన్ వి కే సుధాకర్ రావు తెలిపారు. కరోనా నిబంధనను ఉల్లంఘించి ఎవరైనా ప్రైవేటు వైద్యులు కరోనా చికిత్స చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుని క్రిమినల్ చట్టం ద్వారా చర్యలు చేపడతామని హెచ్చరించారు.

## గ్రాఫ్ పెంచుకోనేది ఎలా

గుంటూరు, మే 4, (న్యూస్ పల్స్) ఎన్నికలు అన్నీ అయిపోయాయి. ఇప్పట్లో బద్వేల్ ఉప ఎన్నిక తప్ప మరో ఎన్నికకు అవకాశం లేదు. బద్వేల్ నియోజకవర్గం సహజంగా అధికార పార్టీ వైసీ?పీకి అనుకూలంగానే ఉంటుంది. ఇక చంద్రబాబు తనకు, తన పార్టీకి ప్రజల్లో గ్రాఫ్ పెరిగిందని నిరూపించుకోవడమెలా? అన్నది పార్టీ నేతలకు సందేహంగా మారింది. ఏదైనా ఎన్నిక జరిగితేనే అధికార పార్టీపై వ్యతిరేకత ఉందా? లేదా? అన్నది అర్థమవుతుంది. కానీ స్థానిక సంస్థల ఎన్నికలతో సహా అంతా పూర్తయిపోయాయి.ఇప్పుడు చంద్రబాబు ప్రజల్లోకి వెళ్లి విస్తృతంగా తన ఇమేజ్ ను పెంచుకునే ప్రయత్నం చేయాలి. కానీ కరోనా రూపంలో అది ఇప్పట్లో సాధ్యమయ్యేలా కన్పించడం లేదు. తిరుపతి ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న చంద్రబాబు అటునుంచి అటే హైదరాబాద్ వెళ్లిపోయారు. కరోనా తీవ్రత ఎక్కువగా ఉండటంతో చంద్రబాబు జూమ్ యాప్ కే పరిమితమయ్యారు. నేతలతో మాట్లాడటం మినహాయించి పర్యటనకు ఇప్పట్లో అవకాశం కన్పించడం లేదు.చంద్రబాబు తిరుపతి ఉప ఎన్నిక తర్వాత జిల్లాల పర్యటనను చేయాలని భావించారు. తిరుపతి ఫలితం ఎటు వచ్చినా, తన పర్యటన శ్రేణుల్లో జోష్ నింపిందని చంద్రబాబు గుర్తించారు. నేతలు కూడా తన పర్యటనలో సమన్వయంతో పనిచేయడంతో జిల్లాల పర్యటనల ద్వారానే పార్టీని బలోపేతం చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర కమిటీ, పార్లమెంటరీ నియోజకవర్గాల కమిటీలను నియమించడంతో వారితో కూడా భేటీ అయి జిల్లాల సమస్యలపై ప్రభుత్వం పోరాటం చేయాలని భావించారు.కరోనా కారణంగా ఇది మరికొంత కాలం వాయిదా పడే అవకాశాలు కన్పిస్తున్నాయి. జగన్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందా? లేదా? అన్నది తెలుసుకునేందుకు ఇప్పట్లో చంద్రబాబుకు అవకాశాలు లేవు. తాను సర్వేలు చేయించినా దానిపై ఆయన నమ్మకం కోల్పోయారు. గత ఎన్నికల సందర్భంగా తాను చేయించిన ముందస్తు సర్వేలు ఫెయిల్ కావడంతో దానిపై చంద్రబాబు ఇక సర్వేలపై ఆధారపడకూడదని, క్షేత్రస్థాయి క్యాడర్ నుంచే ఫీడ్ బ్యాక్ తీసుకోవాలన్నది చంద్రబాబు నిర్ణయంగా ఉంది.

## వ్యాక్సినో...రామచంద్రా

విజయవాడ, మే 4, (న్యూస్ పల్స్) వాక్సినేషన్ కోసం తంటాలు పడుతున్నారు విజయవాడ నగరవాసులు. ఫస్ట్ డోస్ ఇప్పటివరకు దొరకని పరిస్థితి విజయవాడ లో ఏర్పడింది. సెకండ్ డోస్ ఎక్కడ వేస్తారు అన్న దానిపైన పూర్తి క్లారిటీ లేదు.. అధికారుల నుంచి కూడా సమాధానం రావట్లేదు.వ్యాక్సినేషన్ ఎక్కడ దొరుకుతుందో తెలిక విజయవాడ లోని అన్ని సచివాలయాలకు నగర వాసులు తిరుగుతున్నారు. వాక్సినేషన్ ఎక్కడ చేస్తారు తెలియకుండా ఏవిధంగా వ్యాక్సిన్ వేయించుకుంటామని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రాణాలు పోతే ఎవరు బాధ్యత వహిస్తారని విజయవాడ వాసులు నిలదీస్తున్నారు. కో వ్యాక్సిన్ ఒక చోట, కోవి షీల్డ్ ఒక చోట చేర్చాలి ఉన్నా? ఇంతవరకు ఏది ఎక్కడ దొరుకుతుందో సరైన సమాచారం సచివాలయ ఉద్యోగులు,అధికారులు ఇవ్వలేదు. మరో వైపు రాష్ట్రంలో ఆక్సిజన్ కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో అధికారులు సిద్ధమవుతున్నారు. కొవిడ్ స్పెషలాఫీసర్ ఎంటి కృష్ణబాబు తాజాగా కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వాడుతున్న లిక్విడ్ నైట్రోజన్ గ్యాస్ ట్యాంకర్లను ఆక్సిజన్ రవాణాకు వాడేటట్లు మార్పులు చేసినట్టు ఆయన చెప్పారు.ప్రస్తుతం 9 ట్యాంకర్లలో రెండు ఏపీకి ఇవ్వడానికి సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారని వివరించారు. ఒరిస్సాలోని అంగూల్ నుండి ఆక్సిజన్ రవాణాకు ఎయిర్ఫోర్స్ 2 ట్యాంకర్లను విజయవాడ లేదా తిరుపతి నుండి వాయు మార్గాన భువనేశ్వర్ కి చేర్చడానికి ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. కేంద్రం ప్రభుత్వం దిగుమతి చేసుకునే ఐఎస్ఓ కంటైనర్ ట్యాంకర్ లలో కూడా రాష్ట్రానికి ఇచ్చే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఈ ట్యాంకు ను ఆసుపత్రిలో 17 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నెలకొల్పేందుకు అవకాశం ఉందని, ఒక వారం లోపు మరో రెండు ఆక్సిజన్ ట్యాంకులను మన సర్క్యూట్ లో పెట్టడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నామని వివరించారు.

## ఆన్ లైన్ లో కర్మకాండ

ఏలూరు, మే 4, (న్యూస్ పల్స్)కరోనా పుణ్యమా అని మనుషుల మధ్య దూరం బాగా పెరిగింది. అంతే కాకుండా మనుషుల్లో భయం కూడా కాస్త ఎక్కువగానే పెరిగింది అనే మాట వాస్తవం. కరోనా కేసులు భారీగా ఉన్న నేపథ్యంలో మనుషుల్లో మానవత్వం కూడా పెద్దగా కనపడటం లేదు. తాజాగా ఒక ఆసక్తికర ఘటన జరిగింది. ఆన్లైన్ లో కర్మకాండలు నిర్వహించారు. భీమవరం నుంచి ఆన్లైన్లో కర్మకాండలు జరిపారు.బెంగళూరులో 11 రోజుల క్రితం పద్మావతి అనే మహిళ చనిపోయారు. ఆమెకు ఆన్లైన్లో కర్మ కాండలను బ్రాహ్మణులు నిర్వహించారు. పద్మావతికి భర్త ,ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త, ఒక కుమారుడు బెంగళూరు, మరో కుమారుడు అమెరికాలో నివాసం ఉ ంటున్నారు. బెంగళూరులో కర్మకాండలు నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో భీమవరం నుంచి ఆన్లైన్ లోనే కర్మకాండలు చేసారు. 11వ రోజు కార్యక్రమంను బ్రాహ్మణులు నిర్వహించారు.

## అసంతృప్తితో గొట్టిపాటి



ఒంగోలు, మే 4, (న్యూస్ పల్స్) తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పార్టీపై అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. అధినాయకత్వం పార్టీని పట్టించుకోక పోవడం, క్యాడర్ లో నమ్మకం లేకపోవడంతో ఇక పార్టీలో ఉండి ఏం చేయాలని ఆయన తన సన్నిహితుల వద్ద అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. తనను ఆర్థికంగా తీవ్ర నష్టపరిచినా తట్టుకుని నిలబడినా తనకు అధినాయకత్వం అండగా నిలబడలేదన్నది గొట్టిపాటి రవికుమార్ అభియోగంగా కన్పిస్తుంది.గొట్టిపాటి రవికుమార్ ను వైసీపీలోకి తెచ్చేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయి. అయితే ఆయన తిరిగి వైసీపీలోకి రాకపోవడంతో ఆయన చిరకాల ప్రత్యర్థి కరణం బలరాంను చేర్చుకున్నారు. అప్పట్లో నారా లోకేష్ స్వయంగా హామీ ఇవ్వబట్టే టీడీపీలో గొట్టిపాటి రవికుమార్ చేరారు. లోకేష్ హామీ ప్రకారం టీడీపీ కరణం ఫ్యామిలీని అద్దంకి నుంచి పక్కకు తప్పించి చీరాలకు పంపింది. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి గొట్టిపాటి రవికుమార్ ను టార్గెట్ చేసింది.ఆయనకు ఆర్థికంగా బలమైన గ్రానైట్ క్వారీలపై వరస దాడులు జరిగాయి. దాదాపు వందకోట్ల జరిమానా విధించారు. గ్రానైట్ తవ్వకాలను నిలిపేవారు. జరిమానాపై న్యాయస్థానానికి వెళ్లి గొట్టిపాటి రవికుమార్ స్టే తెచ్చుకున్నా క్వారీలు ఆగిపోవడంతో ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. ఇటీవల పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లోనూ తన అనుచరులను గెలిపించుకోవడానికి గొట్టిపాటి రవికుమార్ బాగా ఖర్చు చేశారని టాక్. అయినా ఫలితం దక్కలేదు.దీంతో తన విషయంలో టీడీపీ అధినాయకత్వం పట్టించుకోవడం లేదన్న ఆవేదన గొట్టిపాటి రవికుమార్ తన సన్నిహితుల వద్ద వ్యక్తం చేసినట్లు సమాచారం. చంద్రబాబు ఫోన్ చేసి పరామర్శలు తప్ప పెద్దగా ఒరిగిందేమీ లేదని ఆయన భావిస్తున్నారు. గగొట్టిపాటి రవికుమార్ అనుచరులు సయితం ఆయన పై వత్తిడి తెస్తున్నారట. ఇక్కడ ఉండి బావుకునేది ఏమీ లేకపోగా కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయని, వెంటనే నిర్ణయం తీసుకోవాలని ఆయనపై ప్రెజర్ పెడుతున్నారు. అయితే కరణం ఫ్యామిలీ వైసీపీలో ఉండటంతో గొట్టిపాటి రవికుమార్ అనివార్యంగా టీడీపీలోనే ఉండే అవకాశముంది. పార్టీ పై అసంతృప్తిని మాత్రం ఆయన త్వరలోనే బహిరంగంగా వెళ్లగక్కే అవకాశముందంటున్నారు.

## కఠినంగా కర్ఫ్యూ అమలు

కడప కడప జిల్లాలో కరోనా పాజిటివ్ కేసులు తీవ్రస్థాయిలో విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు కర్ఫ్యూ ఆంక్షలు కఠినంగా అమలు చేస్తున్నామని ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. కరోనా కట్టడికి జిల్లా వ్యాప్తంగా 600 పికెట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రద్దీ ప్రాంతాలు, రైతుబజార్లు, షాపింగ్ మాల్స్లో భౌతిక దూరం, మాస్కుల ధరించడం వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో కొవిడ్ బాధితుల నుంచి అధిక ఫీజులు, రెమ్డెసివిర్ సూదిమందు ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

# ఆర్థిక మూలాలపై వేటు.. ?

గుంటూరు, మే 4, (న్యూస్ పల్స్) చంద్రబాబుకు రానున్న మూడేళ్ళు అసలు సిసలు అగ్ని పరీక్ష కాబోతోంది. చంద్రబాబు మొదటి రెండేళ్లూ దూకుడు రాజకీయం చేసి చాలా ఆయాసపడిపోయారు. జగన్ కుర్చీ ఎక్కగానే దిగిపో అంటూ ఆయన చేసిన నానా యాగీ వల్ల జనాలు లైట్ తీసుకునే పరిస్థితి వచ్చింది. బంపర్ మెజారిటీతో గెలిచిన జగన్‌కి అపుడే వ్యతిరేకత వస్తుంది అని తప్పుడు అంచనాలు కట్టడంలోనే ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ బోల్తా కొట్టారు. ఈ ఏడాది లోకల్ బాడీ ఎన్నికలతో మొదలుపెట్టి తిరుపతి లోక్ సభ ఉప ఎన్నికవరకూవైసీపీసాధించినఅప్రతిహత విజయాలు చంద్రబా బుకూ టీడీపీకి బిగ్ షాక్ ఇచ్చేశాయి. ఇక మిగిలింది బద్వేల్ ఉప ఎన్నిక. అది ఎటూ జగన్ సొంత ఇలాకా కడపలో జరిగే ఎన్నిక. కాబట్టి దాన్ని గురించి పెద్దగా ఆలోచించడం అనవసరం.జగన్ వరసపెట్టి టీడీపీ నేతలను అరెస్ట్ చేసి కేసులు పెడుతున్నారు. ఇదే ఊపులో మరింతమంది నేతలు కూడా వైసీపీ సర్కార్ కి టార్గెట్ అవుతారు అన్న చర్చ ఉంది. ఇక రానున్న మూడేళ్ళూ పెద్దగా ఎన్నికలు ఉండవు కాబట్టి జగన్ సర్కార్ కి ప్రజామోదం లేదని నిరూపించే అవకాశం అయితే చంద్రబాబుకు చిక్కదు. దాంతో ఆయన జనంలో ఉండి ప్రజా సమస్యల మీదనే పోరాటం చేయాలి. ఆ దిశగా క్యాడర్ ని కూడా సమాయత్తం చేయాలి. ఈ లోగా పార్టీ నాయకులను కూడా కాపాడుకోవాలి. ప్రతీ ఓటమీ చంద్రబాబు మీద నమ్మకాన్ని ఎంతో కొంత తమ్ముళ్లకు తగ్గిస్తోంది అన్నది మాత్రం వాస్తవంఇక ఇప్పటిదాకా ఏపీ పొలిటికల్ కథ ఒక ఎత్తు. ముందు ముందు మరో ఎత్తు అన్నట్లుగా ఉ ంటుందని కూడా చెబుతున్నారు. జగన్ ఇక మీదట టీడీపీని గట్టిగానే వేటాడుతారు అంటున్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలతో మొదలుపెడితే బలమైన నేతలను కూడా తన వైపునకు తిప్పుకుంటారని కూడా అంచనాలు ఉ న్నాయి. ఎట్టి పరిస్థితిల్లోనూ 2024 నాటికి టీడీపీకి బాగా బలహీనం కావాలన్నదే జగన్ అజెండాగా ఉంటుంది. ఆయన రాజకీయం ఆయనది కాబట్టి ఇందులో తప్పు పట్టాల్సింది లేదు. ఇది ఫక్త్ రాజకీయం కాబట్టి జనాల వద్దకు వచ్చి మొరపెట్టుకున్నా చంద్రబాబుకు వచ్చే సింపతీ కూడా ఏమీ ఉండదు.ఆయన వీటిని తనదైన రాజకీయంతోనే ఎదుర్కోవాలి. తమ పసుపు గంప కింద కోడి పిల్లలను వైసీపీ లాగేసుకోకుండా కాపాడుకోవాలి.ఏపీ రాజకీయాల్లో ఇన్నాళ్ళూ చంద్రబాబు వ్యూహాలు పనిచేశాయి, విజయాలు తెచ్చాయి. కానీ జగన్ ఎంట్రీతో ఆయన చాలానే కష్టపడాల్సి వచ్చింది. ఇక అదే జగన్ సీఎం.

పైగా ప్రజాకర్షణ కలిగిన నేతగా ఉన్నారు. ఆయన దూకుడుని తట్టుకుని మూడేళ్ళ పాటు పార్టీని నడిపించాలి అంటే మాత్రం చాలా కష్టమనే చెప్పాలి. టీడీపీ ఆర్థిక మూలాలను పసిగట్టి మరీ పనిపడుతున్నారు జగన్. ఇక బలమైన నేతలను కూడా సైలెంట్ చేశారు. ఈ పరిస్థితుల్లో బాబు రోజూ జగన్ని తిడుతూ ఉంటే వచ్చే ఎన్నికల్లో గెలుపు గుమ్మంలోకి రాదు, చంద్రబాబు జగన్ ని మరచిపోయి ప్రజా సమస్యల మీద పోరాడాలి. ఈ సమయంలో పార్టీలో తనతో కలసి వచ్చే వారిని ఏరుకుని మంచి టీమ్ ని తయారు చేసుకోవాలి. అంతే తప్ప జగన్ మీద వ్యతిరేకతో అధికారం దక్కుతుంది. పొత్తులతో నెగ్గుతాను అని లెక్కలేసుకుంటే మాత్రం మళ్లీ జగనే ఏపీకి సీఎం గా రావడం ఖాయం.

# జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్..!




### కొవిడ్ కమాండ్ కంట్రోల్ వద్ద ఖాళీ కుర్చీలు దర్శనం..

నందికొట్కూరు. మే 04కరోనా వైరస్ సెకండ్ వేవ్ విజృంభిస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం మండల పరిధిలో తహసిల్దార్ కార్యాలయం అవరణలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. సిబ్బంది నిర్లక్ష్యం మూలంగా కోవిడ్ కంట్రోల్ కేంద్రాల వద్ద ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. కోవిడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద పంచాయతీ కార్యదర్శులు, రెవిన్యూ సిబ్బంది ఒకరికి విధులను కేటాయించారు. ప్రతిరోజు కరోనా వైరస్ వ్యాప్తి కేసుల నివేదికలను జిల్లా ఉన్నతాధికారులకు పంపాలని జిల్లా జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య గత గురువారం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన సందర్భంగా మండల అధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ కిందిస్థాయి సిబ్బంది వారి ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వము ఎంతో సదుద్దేశంతో ఏర్పాటుచేసిన కార్యక్రమాలు కొంతమంది అధికారుల నిర్లక్ష్యం మూలంగా అభాసుపాలు అవుతున్నాయి. సిబ్బంది తూతూమంత్రంగా విధులు నిర్వర్తించి సమయపాలన పాటించకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుకారిపోతుంద ని ఆయా గ్రామాల ప్రజలు బాహాటంగానే ఆరోపిస్తున్నారు . నందికొట్కూరు పట్టణంలో మంగళవారం నాటికి 268 కరోనా కేసులు నమోదయ్యాయి. నందికొట్కూరు మండల పరిధిలో ప్రతి రోజూ పదుల సంఖ్యలో కరోనా కేసులు నమోద వుతున్నాయి. కరోనా వైరస్ నివారణకు ఆయా గ్రామాల పరిధిలో అధికారులు అవగాహన కల్పించడం వంటి ప్రత్యేక చర్యలు చేపట్టినా కరోనా కేసులు నమోదు రోజు రోజుకు కొత్త కేసులు నమోదు కావడం అధికారులను ఆందోళన కలిగిస్తోంది. గ్రామాలలో మాస్క్ నిబంధనలు అమలు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. బుధవారం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే దుకాణాలకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం కరోనా నిబంధనలను మరింత కఠినతరం చేయనుంది.

# బలవర్ధక ఆహారమే శ్రీరామరక్ష

### వ్యాధినిరోధక శక్తిని పెంచుకోవాలి
### వైద్య ప్రముఖుల పదేపదే సూచనలు

విజయవాడ,మే4(): కరోనా మహమ్మారిని పూర్తిగా నిర్మూలించేందుకు ఇప్పటి వరకు ఎలాంటి మందులూ రాలేదు. కొన్ని వ్యాక్సిన్లు అందుబాటులోకి వచ్చిన మళ్లీ బూస్టర్ డోసు వేసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి ప్రాణాంతక విషపు వైరస్ నుంచి బయటపడాలంటే..మన ఒంట్లోని వ్యాధినిరోధక యంత్రాంగాన్ని బలోపేతం చేసుకోవడమే మార్గం అని ప్రముఖ వైద్య నిపుణులు పదేపదే సూచిస్తున్నారు. ఇమ్యూనిటీ బలంగా ఉంటే కరోనా వైరస్ మాత్రమే కాదు. ఇతరాత్ర చాలా జబ్బుల నుంచి కూడా కాపాడుకోవచ్చున్నారు. గతంలో వచ్చిన వైరస్‌లతో పోల్చుకుంటే కరోనా పెద్దగా ప్రమాదకరమేమీ కాదు. ప్రతి వ్యక్తిలో రోగనిరోధక శక్తి బలీయంగా ఉంటే.. కరోనా మనల్ని ఏమీ చెయ్యలేదు. ఇప్పటి వరకు సంభవించిన కరోనా మరణాలను పరిశీలిస్తే.. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారే ఈ మహమ్మారికి ఎక్కువగా బలవుతున్నారు. అంటే వ్యాధినిరోధక శక్తి బలహీనంగా ఉన్నవారిపైనే కరోనా వైరస్ తన ప్రతాపం చూపుతోందన్నది సుస్పష్టం. ఈ నేపథ్యంలో కరోనాపై పోరులో మనలోని వ్యాధినిరోధక యంత్రాంగాన్ని పటిష్ఠం చేసుకోవాల్సిన అవసరం చాలా ఉంది. ఈ మహమ్మారిని ఎదుర్కోవడానికి మనలోని ప్రతి ఒక్కరూ బలవర్ధకమైన ఆహారంపై దృష్టి పెట్టాలి.కరోనా మహమ్మారిపై విజయం సాధించాలంటే భౌతిక దూరం పాటించడంతోపాటు, ఇమ్యూనిటీని పెంచుకోవాలి.దీనికోసం పండ్లు, కూరగాయల్ని అధికంగా తీసుకోవాలి. ప్రధానంగా చిరుధాన్యాలను డ్రై ఫ్రూట్స్‌ని తీసుకోవడం మరీ మేలు. పుల్లగా ఉండే పండ్లను తినడం వల్ల శరీరానికి అవసరమైన విటమిన్–సి అందుతుంది. విటమిన్ సి సమృద్ధిగా లభిస్తుంటే.. మనలోని వ్యాధి నిరోధక శక్తి కూడా బాగుంటుంది. నిమ్మ, దానిమ్మ, బత్తాయి, కమల, నారింజ వంటి పండ్లను అధికంగా తీసుకోవాలి. అల్లం, వెల్లుల్లి, బొప్పాయి, గ్రీన్ టీ వంటి వాటికి మన ఒంట్లో రోగ నిరోధకతను పెంచే గుణం ఉంది. వీటిని తరచుగా తీసుకోవాలి.మన ఒంట్లో రోగ నిరోధక యంత్రాంగాన్ని పటిష్ఠంగా ఉంచుకునేందుకు ఆహారపు అలవాట్లకు తోడుగా నిత్యం కాసేపు వ్యాయామం చేయడాన్ని అలవాటుగా మార్చుకోవాలి. సాధ్యమైనంత ఎక్కువగా నీటిని తాగుతూ ఉండాలి. కరోనాను కట్టడి చేయడానికే కాదు. ఇతరాత్ర ఆరోగ్య సమస్యల్ని దూరంగా ఉంచడానికి వ్యక్తిగతంగా సామాజికంగానూ పరిశు భ్రతను పాటించాలి. తరచూ చేతుల్ని శుభ్రం చేసుకోవడాన్ని ఓ అలవాటుగా మార్చుకోవాలి. భౌతికదూరాన్ని కచ్చితంగా పాటించాలి. అప్పుడే మహమ్మారి కరోనాను మనం కట్టడి చేయగలమన్నారు.

# పంచాయతీ కార్మికులకు బకాయిలు చెల్లించాలి

### సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి గని శెట్టి సత్యనారాయణ

విశాఖపట్నం పరవాడ మండలంలో పంచాయతీ కార్మికులకు బకాయి పడ్డ 13 నెలలు జీతాలు చెల్లించాలని మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మండలంలో పారిశుద్ధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కరోనా కాలంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల ప్రాణాల కోసం పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పంప్ ఆపరేటర్ లకు ఎలక్ట్రికల్ వర్కర్స్ కు ప్లంబర్ లకు గ్రామపంచాయతీ లో జీతాలు 13 నెలలు బకాయి ఉంటే ఎలా బతకాలని ప్రశ్నించారు. మాస్కులు శానిటైజర్ బూట్లు యూనిఫార్మ్ సబ్బులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా తో మరణించిన ప్రాంతంలో పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్న సమయంలో మాస్కులు లేకపోతే ఏ రకంగా పనులు నిర్వహించగలరు అని ప్రశ్నించారు వెంటనే బకాయి జీతాలు చెల్లించాలని పిఎఫ్ ఈ ఎస్ ఐ ఐడి కార్డులు భద్రతా పరికరాలు పంచాయతీల్లో కార్మికులకు ఇవ్వాలని గని శెట్టి డిమాండ్ చేశారు అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఈవో ఆర్ డి పద్మ గారికి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు డి విశాఖ ఆర్ విజయ పి పారుపల్లి ఎస్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల పేరిట మోసం

### మహిళపై పోలీసులకు పిర్యాదు

విశాఖ నెవల్ డాక్ యార్డ్ లో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఒక మహిళ మోసం చేసిందంటూ బాధితులు నర్సీపట్నం పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసారు. నెవల్ డాక్ యార్డ్ లో ఉద్యోగాల పేరిట ఒకొక్కరి వద్దనుండి 3 లక్షలు వసూలుచేసిన మహిళ, తమకు ఉద్యోగం ఇప్పించక పోగా తాము కట్టిన డబ్బులులైన ఇవ్వమంటే ఇవ్వడం లేదంటూ బాధితుల ఆవేదన వ్యక్తం చేసారు.నర్సీపట్నం మండలం గబ్బాడా గ్రామంకు చెందిన మడ్డు యజ్ఞేశ్వరవు,బొంత ఎమల్లేశ్వరరావు, నర్సీపట్నం బిసి కాలనీ, కోటవురట్ల కు చెందిన 10మంది వరకు తమ స్నేహితులకు నేవల్ డాక్ యార్డ్ లో ఉ ద్యోగాలు ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరి వద్ద నుండి 3 లక్షలు వసూలు చేసారంటూ నర్సీపట్నం టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లలో పిర్యాదుచేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గబ్బాడా గ్రామంకు చెందిన కన్నూరు శివలక్ష్మి తన భర్త రాజు నాయుడు తన భార్య నేవల్ డాక్ యార్డ్ లో ఉద్యోగం చేస్తుందని నమ్మబలికి మీకు అందులో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు కట్టించుకున్నారన్నారు. డబ్బులు కట్టి ఎంతకీ ఉద్యోగం రాకపోవడంతో వారిని అడుగగా కట్టినవాటిలో కొంతమొత్తం ఇచ్చారని మిగిలిన మొత్తం ను అడుగగా వారు మాపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. వారి గురించి నేవల్ డాక్ యార్డ్ లో విచారణ చేయగా శివలక్ష్మి కాంట్రాక్టు విధానంలో ఉద్యోగం చేసేదని ఇప్పుడు ఉద్యోగం కూడా చెయ్యడం లేదని తెలిపారు. తమకు న్యాయం చెయ్యాలని తమలాగా ఎవ్వరు మోసపోకుండా వుండే విధంగా వారిపై చర్యలు తీసుకోవాలంటూ పిర్యాదు చేసినట్లు తెలిపారు.

## లెఫ్ట్..రైట్... చెరో దారి

విజయవాడ, మే 4, (న్యూస్ పల్స్) ఆంధ్రప్రదేశ్ లో వామపక్షాల దారెటన్నది ఈసారి ఆసక్తికరంగా మారింది. అన్ని పార్టీలూ వారి భావజాలానికి వ్యతిరేకంగా ఉండటంతో ఇప్పుడు ఏ పార్టీకి మద్దతివ్వాలన్నది సీపీఐ, సీపీఎం పార్టీల్లో చర్చనీయాంశమైంది. ఏపీలో కమ్యునిస్టుల ప్రభావం ఒకప్పుడు ఉ ండేది. కానీ క్రమేణా ఏదో ఒక పార్టీతో కలసి ప్రయాణం చేశారు. తెలుగుదేశం, కాంగ్రెస్ తో కలసి పోటీ చేసినప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ప్రాతినిధ్యం లభించేది.కానీ రాష్ట్ర విభజన తర్వాత మాత్రం కలసి రాలేదు. 2014లో సీపీఎం వైసీపీతో మనసు కలిపినా ఫలితం లేకుండా పోయింది. ఇక 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ తో కలసి నడిచారు. ఆ ఎన్నికల్లోనూ జీరో ఫలితాలు వచ్చాయి. ఇప్పుడు పవన్ కల్యాణ్ బీజేపీ పంచన చేరిపోయారు. ఇక జనసేనకు వామపక్షాలు దూరమయినట్లే. అయితే సీపీఎం కొంత పొత్తుల విషయంలో సంయమనం పాటిస్తుందనే చెప్పాలి.సీపీఐ మాత్రం మొన్నటి వరకూ అనేక సమస్యలపై టీడీపీతో కలసి పోరాడింది. చంద్రబాబుతో కలసి సీపీఐ నేత రామకృష్ణ అనేక వేదికలను పంచుకున్నారు. విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీతో కలసి బరిలోకిదిగి రెండు డివిజన్లను గెలుచుకుంది. టీడీపీతో కలసి నడుద్దామని భావిస్తున్న సీపీఐకి ఇప్పుడు చంద్రబాబు సయితం బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారు. బీజేపీ అంగీకరిస్తే ఆయన ఆ కూటమిలోకి వెళతారు.అందుకే తిరుపతి ఉప ఎన్నికల్లో వామపక్షాలు తమ పార్టీ అభ్యర్థిని నిలబెట్టాయి. సరే గెలుపోటములను పక్కన పెడితే టీడీపీకి దూరంగా ఉండాలని నిర్ణయించినట్లుంది. ఇక సీపీఎం కొంత అధికార వైసీపీకి దగ్గరగా జరుగుతున్నట్లు స్పష్టమవుతుంది. ఏపీ శాసనసభకు పదేళ్ల నుంచి దూరంగా ఉన్న వామపక్షాలు ఈసారి ఎలాగైనా అసెంబ్లీలోకి అడుగుపెట్టాలని ప్రయత్నిస్తున్నాయి. మరి పరిస్థితులు చూస్తే ఏ పార్టీ వారి భావజాలానికి అనుకూలంగా లేదు. ఒంటరిగా పోటీ చేస్తారా? ఎవరితో కలసి వెళతారన్నది వారికే క్లారిటీ లేదు

## తిరుమల కొండపై వాణిజ్య సముదాయంలో అగ్ని ప్రమాదం

తిరుమల పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలలో భారీ అగ్నిప్రమాదం జరిగింది.తిరుమల కొండపై ఆస్థాన మండపం కింద ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ లో అగ్నిప్రమాదం జరిగింది. మంగళవారం ఉదయం సర్క్యూట్తో దుకాణాల్లో పెద్ద ఎత్తున మంటలు చెలరే గాయి. ఈ ప్రమాదం లో ఎనిమిది దుకాణాలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. సకాలంలో స్పందించడంతో పెను నష్టం తప్పిందని అధికారులు అంటున్నా రు. కోవిడ్ కారణంగా భక్తుల రాక తక్కువగా ఉండటం,తెల్లవారు జామున కావడం, ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో పది 0లక్షల మేర ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ఘటన సంభవించి ఉండొచ్చని ప్రాథమికంగా నిర్ధారించారు. ఎంత నష్టం వాటిల్లిందనేది తెలియాల్సి ఉంది. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అధికారులు విచారణ చేపట్టారు.

## శ్రీశైలంలో ఉదయం ఆరునుంచి పదకొండు గంటల వరకే దర్శనాలు

శ్రీశైలం ప్రముఖ శైవ క్షేత్రం శ్రీశైలంలో ఇకపై ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు మాత్రమే భక్తులను దర్శనానికి అనుమతిస్తామని ఆలయ ఈఓ కేఎస్ రామారావు తెలిపారు. కొవిడ్ నేపథ్యంలో ఆర్జిత సేవలన్నీ రద్దు చేస్తున్నామని, పరోక్ష సేవలను భక్తులు దేవస్థానం ఛానల్లో వీక్షించవచ్చని పేర్కొన్నారు. దేవస్థాన పరిపాలనా విభాగంతోపాటు అర్చక పండితుల్లో ఇప్పటికే చాలామంది కొవిడ్ బారిన పడ్డారని అయన ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని విభాగాల సిబ్బంది అత్యవసరమైతేనే కార్యాలయాలకు రావాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. శ్రీశైలం సీఐ వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వం పాక్షిక కర్ఫ్యూ విధించినందున అనవసరంగా రోడ్లపై తిరిగితే జాతీయ విపత్తు నివారణ చట్టం కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. అత్యవసరంగా వైద్య సేవల కోసం వెళ్లే వారు, ఆలయ ప్రధాన సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది మినహా ఎవరూ బయట తిరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఉపేక్షించేది లేదన్నారు.

### నందిపాడు లో ప్రభుత్వ భూమి పై కన్నేసిన భూ బకాసురులు

నెల్లూరు నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం నందిపాడు గ్రామం లో సర్కార్ భూములు పై భూకబ్జా బకాసురులు రెచ్చిపోతు న్నారు ఖాళీగా కనిపిస్తే పాక వేస్తున్నా రు అధికారుల ఆజ్యం కబ్జాదారులు భూ దాహం కోటి రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు దుత్తలూరు మండలం నందిపాడు గ్రామంలో చోటుచేసుకు న్నది. సర్వే నేంబర్ 226–3 లో 54 సెంట్లు మరియు 26–2 లో 1.70సెంట్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు యత్నంచేస్తున్నారన్నారు. గతంలో ఈ ప్రభుత్వ భూమిని జగనన్న ఇళ్ల స్థలాల కోసం ఏర్పాటు జరిగిందని అన్నారు అయితే నేషనల్ హైవే పక్కన ఉన్న ఈ భూమి వెల సుమారు కోటి రూపాయలు పలుకుంతున్న నేపథ్యం లో కొందరు భూ కబ్జాదారులుఈ ప్రభుత్వ భూమిని ఆక్రమణకు గురైంది అన్నారు. అయితే భూ బకాసురులు ఇష్టం వచ్చినట్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇష్టానుసారంగా వ్యవహరి స్తున్నారని గ్రామస్థులు వాపోతున్నా రు. తక్షణమే సంబధిత అధికారులు జోక్యం చేసుకొని మాకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

### ఆక్సిజన్ అందక మరణానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి: అఖిలపక్షం

హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో కోవిడ్ బాధితు లకు ఆక్సిజన్ అందక మరణానికి కారణమైన వారిపై జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కఠిన చర్యలు తీసుకోవాలని అనంతపురం జిల్లా హిందూపురం అఖిలపక్షం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రివద్ద నిరసన ధర్నా నిర్వహించారు ఆక్సిజన్ తీసుకోవాలని దాదాపు 50మంది సిబ్బంది కొరతను భర్తీ చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రి ఎమర్జన్సీ విభాగంలోనిత్యం ముగ్గురు వైద్యులు ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని. కోవిడ్ టెస్టుల పరీక్ష నిర్ధారణ వెంటనే వచ్చేలా చేయాలని.కోవిడ్ బాధితుల కోసం కేటాయించిన ప్రయివేటు ఆసుపత్రుల వెంటనే కోవిడ్ పేషేంట్లకు భర్తీచేసుకొనేలా ఆదేశాలు జారీ చేయాలని. మెడికల్ షాపులు కోవిడ్ మాత్రలు ఇంజెక్షన్ ధరల పట్టికను బహిరంగ పర్చాలని. కోవిడ్ మహ మ్మరిని ఆరోగ్యశ్రీ కు వర్తింప జేయాలని. తదితర డిమాండ్లను జిల్లా కలెక్టర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి కోవిడ్ బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# నేటి నుండి రెండు వారాల పాటు ఆంక్షలు అమలు

తుగ్గలి ( విభారె) కరోనా వ్యాప్తిని అరికట్టడానికి నేటి నుండి రెండు వారాల పాటు కఠిన ఆంక్షలను అమలు చేస్తున్నట్లు తుగ్గలి,జొన్నగిరి మరియు మద్దికేర ఎస్.ఐలు నాగేంద్ర, సురేష్, మస్తాన్ వలి లు తెలియజేశారు.ఈ సందర్భంగా మంగళవారం రోజున వేరు వేరు సందర్భాల్లో ఎస్.ఐ లు పోలీస్ స్టేషన్ లలో మాట్లాడుతూ నేటి నుండి తుగ్గలి,మద్దికేర మండలాల వ్యాప్తంగా కఠిన ఆంక్షలు అమలు చేస్తామని వారు తెలియజేశారు.రోజు రోజుకు ఉగ్రరూపం దాలుస్తున్న కరోనా వైరస్ ప్రభావం వలన మే 5వ తేదీ నుండి రెండు వారాల పాటు ఆంక్షలను అమలు చేస్తున్నట్టు వారు తెలియజేశారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుండి 12 గంటల వరకు మాత్రమే షాపులకు అనుమతి ఉంటుందని,12 గంటల తరవాత షాపు యజమానులు స్వచ్ఛందంగా మూసివేయాలని వారు తెలియజేశారు.12 గంటల అనంతరం మండలాల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు అవుతుందని వారు తెలియజేశారు.మధ్యాహ్నం 12 గంటల తర్వాత అత్యవసర సేవలకు మాత్రమే అనుమతి ఉంటుందని వారు తెలియజేశారు.ప్రభుత్వం నిర్దేశించిన ఆంక్షలను అనుసరించి ప్రజలు నడుచుకోవాలని వారు తెలియజేశారు.ప్రజలు గ్రామాలలో గుంపులు గుంపులుగా ఉండకుండా మాస్కును ధరించి భౌతిక దూరాలను పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని వారు తెలియజేశారు.అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రాకూడదు అని వారు హెచ్చరించారు.ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు తప్పకుండా మాస్కులు ధరించాలని వారు తెలియజేశారు.గ్రామాలలోని ప్రజలకు ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఏర్పడితే గ్రామ సచివాలయ కమిటీ సభ్యులకు వెంటనే సమాచారం అందించాలని ఎస్సైలు తెలియజేశారు.కావున ప్రజలు ప్రభుత్వం నిర్దేశించిన ఆంక్షలను తప్పకుండా పాటిస్తూ అధికారులకు సహకరించాలని వారు తెలియజేశారు.కోవిడ్ ఆంక్షలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తుగ్గలి మరియు మద్దికెర మండల ఎస్సైలు హెచ్చరించారు.

# ప్లాస్మా దానం చేసి ప్రాణాలు కాపాడండి

## కోట సునీల్ కుమార్ స్వామి పిలుపు

నెల్లూరు ( విభారె) కరోనా వ్యాధి నుంచి కోలుకున్న వారు ధైర్యంగా ముందుకొచ్చి, ప్లాస్మా దానం చేసి ప్రాణాలు కాపాడండి" అని డాక్టర్ కోట సునీల్ కుమార్ స్వామి పిలుపునిచ్చారు. కోవిడ్-19 వైరస్ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ఇప్పుడు ఎక్కడ చూసినా ప్లాస్మా దానం అనే మాట వినిపిస్తోందని ,అసలు ప్లాస్మా అంటే ఏంటి?. ప్లాస్మా అన్నది ఇప్పుడు ఎందుకు అంత ప్రాచుర్యంలోకి వచ్చింది?... కోవిడ్ పేషెంట్ల పాలిట ప్లాస్మా ఒక సంజీవనిలా ఎందుకవుతోంది?... ఇవన్నీ కచ్చితంగా ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డాక్టర్ కోట సునీల్ కుమార్ స్వామిఅన్నారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఒకరికొకరం తోడుగా ఉండటం ఎంతో అవసరం అని... కరోనా విజృంభిస్తోన్న నేపథ్యంలో ప్లాస్మా థెరపీ ప్రాణాలను నిలబెట్టడానికి ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు.ప్లాస్మాపైఅవగాహన తెచ్చుకుని ముందుకొచ్చి ప్లాస్మాదానం చేసిన వారందర్నీ అభినందిస్తున్నాను అని అన్నారు. కోవిడ్ వైరస్‌లు మన శరీరంలోకిచేరినప్పుడు వాటిని తెల్లరక్త కణాలు గుర్తించి చంపేందుకు కావాల్సిన యాంటీబాడీలు తయారవుతుంటాయని... ఆ యాంటీబాడీలు ప్లాస్మాలోనే ఉంటాయని చెప్పారు. కోవిడ్ నుంచి కోలుకున్న పేషెంట్ల ప్లాస్మాలోనూ ఇలాంటి యాంటీబాడీలు పెద్దసంఖ్యలో తయారై ఉంటాయని, అందువల్ల అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న పేషెంట్లకు, ఇప్పటికే కోవిడ్ నుంచి కోలుకున్న పేషెంట్ల ప్లాస్మాను ఎక్కిస్తే త్వరగా కోలుకుని ప్రాణాపాయం నుండి బయటపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. అందుకే ఇప్పుడు ప్రభుత్వాలు, సెలబ్రిటీలు, డాక్టర్లు ప్లాస్మా దానం చేయాల్సిన ఆవశ్యకతపై ప్రచారం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్లాస్మా దానం చేసిన వారికి రూ5వేల ప్రోత్సాహకంగా ప్రకటించారని తెలిపారు.ఇంతకూ ప్లాస్మా అంటే ఏంటి?.రక్తంలో నీటి మాదిరిగా ఉండే పసుపుపచ్చని ద్రవాన్నే ప్లాస్మా అంటారు. రక్తంలో ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాలు, ప్లేట్‌లేట్స్ వంటివి తొలగించిన తర్వాత మిగిలి ఉండే ద్రవమే ప్లాస్మా. మన రక్తంలో 55 శాతం దాకా ప్లాస్మా ఉంటుంది. పసుపు రంగులో ఉండే ప్లాస్మా ద్రవం ఎంజైమ్‌లు, రోగ నిరోధక కణాలు, ఇతర ప్రోటీన్లను కలిగి ఉంటుంది. శరీరంలో రక్తాన్ని గడ్డకట్టించడంతో పాటు వ్యాధులను ఎదుర్కోవడానికి ప్లాస్మా ఉపయోగపడుతుంది.ప్లాస్మా థెరపి అంటే ఏంటి?.కోవిడ్‌ను ఎదుర్కోవడానికి మనిషిలో ఉండే రోగ నిరోధక శక్తి కీలకమైనది. కోవిడ్‌ను జయించిన వారి శరీరంలో రోగ నిరోధక కణాలతో కూడిన ప్లాస్మాను సేకరించి వైరస్ సోకిన వారి శరీరంలోకి పంపిస్తారు. దీంతో వారిలో కూడా రోగ నిరోధక కణాలు ఏర్పడి వైరస్‌ను నాశనం చేస్తాయి. ఈ మొత్తం ప్రక్రియను ప్లాస్మా థెరపీ అంటారు.ప్లాస్మా ఎలా సేకరిస్తారు?.ప్లాస్మా సేకరించే విధానం కూడా రక్తదానం చేయడంలాగే ఉంటుంది. శరీరంలో నుంచి రక్తాన్ని తీసుకొని అందులో ప్లాస్మాను వేరు చేస్తారు.

## కరోన బాధితులకు సేవలందిస్తా... వల్లంకొండ సాయి

ఆళ్లగడ్డ ::(విభారె న్యూస్) కర్నూల్ జిల్లా చాగలమర్రికి చెందిన యువకుడు వల్లంకొండు సాయి సుదర్శన్ కరోన పాజిటివ్ వచ్చిన వారికి సేవలు అందించేందుకు ముందుకు వచ్చాడు. దుకాణానికి వెళ్లి అవసరమైన



మందులు మరియు సరుకులు కొనుగోలు చేయలేని కరోనా బాధితులకు డోర్ డెలివరీ ఇచ్చిన తరువాత డబ్బులు ఇస్తే ఇస్తే చాలని అంటున్నాడు . వల్లంకొండు సాయి మీడియా తో మాట్లాడుతూ తన సేవలు కరోనా బాధితులు ఉపయోగించుకోవాలని కోరాడు. ఎవరికైనా అత్యవసరం ఉంటే ఈ క్రింది నంబర్లకు సంప్రదించవచ్చని తెలిపాడు. 9948340319, 8639004420 భవిష్యత్తులో మరెన్నో కార్యక్రమాలు చేయాలని అనుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

# ఈ మూడు అలవాట్లు మీ తల్లిని ఆరోగ్యంగా మరియు సంతోషంగా ఉండేలా చేయగలవు



హైదరాబాద్, ): దేవుడు ప్రతిచోటా ఉండలేక అమ్మని సృష్టించాడు అంటారు. నిజమే, ప్రేమకి స్వచ్ఛమైన రూపంలా ప్రతిబింబిస్తుంది అమ్మ. తల్లి విలువ తెలిసిన ప్రతిఒక్కరికీ తల్లిప్రేమ విలువ తెలుస్తుంది. తల్లి అంటేనే ఒక అద్భుతం, కుటుంబానికి వెన్నెముకలా ఉంటూ, అందరి సంరక్షణకు బాధ్యత వహించే నిస్వార్ధ జీవి అమ్మ.ఈ ప్రపంచమంతా మనల్ని విడిచినా, మన చేయి వదలకుండా మనకు మద్దతునిచ్చే ఒకే ఒక వ్యక్తి అమ్మ. ఆమె ఉదారత, సంరక్షణ, ఆప్యాయత, క్షమాగుణం ఏ ఇతర వ్యక్తితోనూ సరితూగదు. ఒక తల్లి ప్రేమను నిర్వచించడం ఎంతటి వారికైనా ఒక సవాలుగానే ఉంటుంది. ప్రతి ఒక్కరి వ్యక్తిగత అవసరాలను నిరంతరం గమనిస్తూ, తనవారికోసం, ఎటువంటి త్యాగానికైనా సిద్ధపడే అమ్మ అనిర్వచనీయం. అటువంటి అమ్మను జీవితాంతం సంతోషంగా చూసుకోవలసిన బాధ్యత మనమీద ఉంటుంది. అవునా? కొన్నిరోజుల క్రితం, ప్రపంచ తల్లుల దినోత్సవం నాడు మంచిమంచి కాప్షన్లతో కూడిన చిత్రాలు, కొటేషన్లు, శీర్షికలను సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేస్తూ, వారివారి తల్లుల మీద ఉన్న ప్రేమను ప్రపంచంతో పంచుకోవడం అందరమూ చూశాము. కానీ మిగిలిన సంవత్సరమంతా అదే ప్రేమను కొనసాగిస్తున్నారా? లేదా కేవలం సోషల్ మీడియాలో లైకులు, షేర్ల కోసమే అన్నట్లు పోస్ట్లు చేశారా? ఇక్కడ ఎవరినీ కించపరచడం లేదు. తల్లులను గుండెలలో పెట్టుకుని చూసే పిల్లలు ఉన్నట్లే, వారిని నిరంతరం తమచేష్టలతో భాదపెట్టే వారు కూడా ఈ ప్రపంచంలో సర్వసాధారణం. మారుతూ ఉన్న టెక్ ప్రపంచం కారణంగా పక్కన చేరి, బాగోగులు అడగాల్సిన వారు ఎప్పుడో కానీ, మెసేజ్ లేదా కాల్స్ ద్వారా చుట్టపు చూపుగా పలకరిస్తూ సంబంధాల ఉనికినే ప్రశ్నార్ధకం చేస్తున్నారు అన్నది వాస్తవం. ఆమెకు ఖరీదైన బహుమతులను ఇవ్వడానికి బదులుగా, ఇక్కడ చెప్పబడిన మూడు అలవాట్లను పాటిస్తున్నారేమో గమనిస్తూ ఉండండి. ఈ మూడు అలవాట్లు, ఆమెను సంతోషంగా, ఆరోగ్యంగా ఉండేందుకు దోహదం చేస్తాయి.1. పోషకాహారాన్ని తీసుకోవడం:తల్లి, వారి పిల్లలు తినగా మిగిలిపోయిన ఆహారాన్ని తినే అలవాటును కలిగి ఉంటుంది. దీనికి కారణం, ఆమె ఆహారాన్ని వృథాచేయటానికి ఇష్టపడకపోవడమే. మరియు కష్టపడి సంపాదించినది అన్న భావన. ఇలా పిల్లలు తినగా మిగిలిన బర్గర్/పాన్కేక్ వంటి ఆహారాలను తరచుగా తీసుకోవడం కారణంగా, శరీరంలో అదనపు కేలరీలు పేరుకొనిపోయే ప్రమాదం ఉంది. క్రమంగా ఇది ఊబకాయానికి దారితీయవచ్చు.మీ పిల్లలు తినే తీరు, పరిమాణం వయసు దృష్ట్యా మారుతుందని గ్రహించడం అత్యవసరం. పసిపిల్లలకు కొంత సమయం విరామం ఇచ్చిన తర్వాత భోజనం అవసరం ఉండవచ్చు, కానీ పెద్దలలో, జీర్ణవ్యవస్థ భిన్నంగా ఉన్న కారణాన, ప్రతి రెండు-మూడు గంటలకు ఒకసారి ఆహారాన్ని తీసుకోవలసిన అవసరం ఉండదు. కావున తీసుకునే ఆహారం మీద శ్రద్ధ ఉంచడం అవసరం.అంతేకాక, అధిక పనిఒత్తిడి కారణంగా మహిళల్లో అనేకమంది తరచుగా ఆహారాన్ని మరచిపోవడం, లేదా స్కిప్ చేయడం చేస్తుంటారు. సంవత్సరాలుగా, ఈ నిర్లక్ష్యం కొనసాగడం మూలంగా శరీరంలో అత్యంత ముఖ్యమైన పోషకలోపాలకు దారితీస్తుంది. శరీరం ఆరోగ్యకరమైన జీవక్రియలను కలిగి ఉండాలంటే, మన శరీరంలో తగినంత ప్రోటీన్ ఉండటం అవసరం.గుడ్డు, కాటేజ్ చీజ్, చికెన్ బ్రెస్ట్, లీన్ బీఫ్, చేపలు, క్వినోయా మరియు వోట్మీల్ వంటి ప్రోటీన్ ఆధారిత ఆహారాలను తరచుగా తీసుకునేలా జాగ్రత్త వహించాలి. 2. వ్యాయామం తప్పనిసరి:మన తల్లుల దైనందిక జీవనచర్యలలో బిజీషెడ్యూల్ నిమిత్తం, వ్యాయామానికి సమయం కేటాయించలేని స్థితిలో ఉంటూ ఉంటారు. కానీ ఒక ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలంటే, జీవనశైలికి సరిపోయేలా, మరియు శరీరం క్రియాశీలకంగా ఉండేందుకు వ్యాయామం తప్పనిసరిగా ఉంటుంది. వ్యాయామశాలకు వెళ్ళే సమయం లేనిపక్షంలో, ఇంటిలోనే కాస్త సమయం కేటాయించి కొన్ని వ్యాయామ పద్ధతులను అనుసరించడం మేలు. అంతేకాకుండా, జాగింగ్, నడక, ఏరోబిక్స్, యోగా వంటివి కూడా అనుసరించవచ్చు. క్రమంగా అదనపు కేలరీలు కరిగి, శరీరం చురుకుగా ఉండేలా సహకరిస్తుంది. 3. మెదడును శాంతపరచండి:ఆరోగ్యకరమైన ఆహారం మరియు వ్యాయామాలు మీ శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి సూచించదగిన స్పష్టమైన మార్గాలుగా ఉన్నా కూడా, మానసిక ప్రశాంతత కూడా అత్యంత ముఖ్యమైన అంశాలలో ఒకటిగా ఉంటుంది. తరచుగా మన తల్లులు, నిద్రలో ఉలికిపాట్లకు గురవడం లేదా, చిన్నచిన్న విషయాలకే టెన్షన్ గురవడం వంటివి చూస్తూనే ఉంటాం. దీనికి కారణం, వారు ప్రతిఅడుగులోనూ మన సంరక్షణ గురించి ఆలోచించడమే.

## ఐపీఎల్-2021 సీజన్ రద్దు: బీసీసీఐ

న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్ సెకండ్‌వేవ్ విజృంభణ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక నిర్ణయం తీసుకుంది. ఆటగాళ్లు వరుసగా కరోనా బారిన పడుతుండటంతో ఐపీఎల్-2021 సీజన్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా మంగళవారం ప్రకటన విడుదల చేశారు. కాగా వేర్వేరు జట్లలో ఇప్పటికే 9 మంది ఆటగాళ్లకు కోవిడ్-19 సోకింది. బయో బబుల్‌లో ఉన్నప్పటికీ క్రికెటర్లు, ఇతర సిబ్బందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో తొలుత టోర్నీని నిరవధికంగా వాయిదా వేయాలని భావించిన బీసీసీఐ.. 31 మ్యాచ్‌లు మిగిలి ఉండగానే ఈ సీజన్‌ను రద్దు చేస్తున్నట్లు తాజాగా వెల్లడించింది. ఇక ఈ సీజన్‌లో ఇప్పటివరకు 8 మ్యాచ్‌లు ఆడిన ఢిల్లీ క్యాపిటల్స్ ఆరింటిలో గెలుపొంది పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉండగా, 7 మ్యాచ్‌లు ఆడి ఐదింటిలో విజయం సాధించిన సీఎస్‌కే రెండో స్థానంలో ఉంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్-2021)కు కరోనా సెగ తగిలింది. తాజాగా మరో ఇద్దరు క్రికెటర్లు కోవిడ్ బారిన పడటంతో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. క్యాష్ రిచ్ లీగ్‌ను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ధ్రువీకరించారు. కాగా, ఇప్పటికే కోల్‌కతా ఆటగాళ్లు వరుణ్ చక్రవర్తి, సందీప్ వారియర్‌లకు కరోనా సోకిన సంగతి తెలిసిందే.

# బాలీవుడ్ దృష్టిని ఆకర్షించిన తెలుగు సినిమా బండి




ఫ్యామిలీ మ్యాన్ సిరీస్ మేకర్స్ రాజ్ డీకే రూపొందించిన కామెడీ ఎంటర్టైనర్ సినిమా బండి. మే 14న ఈ చిత్రాన్ని ప్రముఖ ఓటీటీ ఫ్లాట్ ఫార్మ్ నెట్ ఫ్లిక్స్ లో విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో నిన్న శుక్రవారం విడుదలైన ఈ సినిమా ట్రైలర్ విశేష స్పందన తెచ్చుకుంటోంది. బాలీవుడ్ సినీ ప్రముఖులు సైతం ఈ తెలుగు సినిమా కంటెంట్ ని ప్రశంసిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ హీరో షాహిద్ కపూర్ ఏకంగా ఈ ట్రైలర్ ని ఇన్స్టాగ్రామ్ స్టోరీగా పెట్టుకున్నాడు. రాజ్ డీకే కి బాలీవుడ్ లో ఉన్న క్రేజ్ దృష్ట్యా సినిమా బండి అక్కడి వారిని ఆకర్షిస్తున్నట్లు అర్థం అవుతోంది. టాలీవుడ్ లో వైజయంతీ మూవీస్ వంటి నిర్మాణ సంస్థలు - తరుణ్ భాస్కర్ వంటి దర్శకులు ఈ సినిమాని ప్రమోట్ చేస్తున్నారు.ఓటీటీలు వచ్చిన తర్వాత భాషతో సంబంధం లేకుండా మంచి కంటెంట్ కు ఆదరణ లభిస్తోంది. ఇప్పుడు సినిమా బండి కి దక్కుతున్న ప్రశంసలు చూస్తుంటే ఈ సినిమా ఎక్కువ మందికి రీచ్ అయ్యేలా అనిపిస్తోంది. ప్రవీణ్ కందిరేగుల అనే కొత్త దర్శకుడు ఈ చిత్రానికి దర్శకత్వం వహించాడు. వసంత్ మరింగంటి రచనా సహకారం అందించాడు. ఆటోలో దొరికిన ఖరీదైన డిజిటల్ కెమెరాను ఉపయోగించి తన గ్రామస్థులతో కలిసి ఓ ఆటో డ్రైవర్ సినిమా ఎలా తీసాడనే కాన్సెప్ట్ తో ఈ చిత్రం తెరకెక్కింది. అమాయకపు మనస్తత్వాలు కలిగిన కొందరు వ్యక్తులు సినిమా తీయడానికి నిజాయితీగా చేసే ప్రయత్నాలు ఆహ్లాదకరంగా సహజంగానూ సినిమా బండి లో చూపించబోతున్నారు. మరో రెండు వారాల్లో ఓటీటీలో రిలీజ్ కానున్న ఈ సినిమా ఎలాంటి రెస్పాన్స్ తెచ్చుకుంటుందో చూడాలి.

# అభిమానులు మెచ్చిన సూపర్ స్టార్ తలా

సౌత్ స్టార్ హీరో అజిత్ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పే అవసరం లేదు. ఎందుకంటే ఆల్రెడీ తెలుగులో కూడా ఆయనకు ఫ్యాన్ బేస్ ఓ రేంజిలో ఉంది. అభిమానులు అజిత్ ను ప్రేమగా తలా అని పిలుచుకుంటారు. అయితే ఈరోజు ఈ స్టార్ హీరో 50వ పుట్టినరోజు కావడంతో సినీ ప్రేక్షకులు సెలబ్రిటీలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. అజిత్ ఎప్పుడు కూడా హంగులు ఆర్భాటాలకు పోకుండా చాలా సింపుల్ గా ఉండటానికే ఇష్టపడతారు. అయితే ఈరోజు ఆయన పుట్టినరోజు కావడంతో ఓసారి ఆయన సౌత్ ఇండియా స్టార్ ఎలా అయ్యారో ఓసారి చూద్దాం.హీరో అజిత్ 1971 మే 1న సికింద్రాబాద్ లో జన్మించాడు. జన్మించింది ఇక్కడే అయినప్పటికీ హీరోగా ఎదిగింది మాత్రం తమిళంలోనే. ఆయన తండ్రి సుబ్రహ్మణ్యం (కేరళ) తల్లి సింధీ (బెంగాలీ). అందుకే అజిత్ ఇటు తెలుగు తమిళంతో పాటు కన్నడ మలయాళం ఇంగ్లీష్ భాషలను చాలా బాగా



మాట్లాడతారు. నిజానికి స్టార్ హీరో కదా.. ఏ రేంజిలో బడా డిగ్రీలు చదివి ఉంటాడు అనుకుంటారు. కానీ అజిత్ టెన్త్ అయిపోగానే చదువు ఆపేసి బైక్ మెకానిక్ గా పనిచేసాడు. ఆ సమయంలోనే సినిమాలపై మక్కువ ఏర్పడి మోడలింగ్ ప్రారంభించాడు.ఇక మోడలింగ్ సమయంలో స్టార్ సినిమాటోగ్రఫర్ పీసీ శ్రీరామ్ గమనించి అజిత్ ను సినిమాల్లోకి రెఫెర్ చేసాడట. ఆ విధంగా అజిత్.. ఎన్ వీడు ఎన్ కనవన్ అనే సినిమాలో చిన్న క్యారెక్టర్ తో సినీ ప్రయాణం మొదలుపెట్టాడు. అజిత్ నటించిన ఒకే ఒక్క స్ట్రెయిట్ తెలుగు మూవీ ప్రేమపుస్తకం కానీ ఆ సినిమా ప్రేక్షకుల ముందుకు రాలేదు. 1995లో అసాయ్ అనే సినిమాతో హీరోగా ఫస్ట్ హిట్ అందుకున్నాడు. ఆ తర్వాత ప్రేమలేఖ సినిమాతో నేషనల్ అవార్డు అందుకున్నాడు అజిత్. అప్పటినుండి అజిత్ సినిమాలు తెలుగులో డబ్ అవుతూనే ఉన్నాయి. ఇప్పటివరకు ఎన్నో అవార్డులు అందుకున్న అజిత్.. 2000లో హీరోయిన్ షాలినిని లవ్ మ్యారేజ్ చేసుకున్నాడు.అజిత్ ఒకే ఏడాది ఆరు సూపర్ హిట్స్ కొట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే స్టార్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ధీనా అనే మాస్ సినిమా చేసాడు. ఆ సినిమా సూపర్ హిట్ అవ్వడంతో ఆ సినిమాలో అజిత్ పేరు తలా. అప్పటినుండి అభిమానులు తలా అనే పిలుచుకుంటున్నారు. ప్రస్తుతం తలా అజిత్ వాలిమై అనే పాన్ ఇండియా సినిమాలో నటిస్తున్నాడు. డైరెక్టర్ హెచ్. వినోద్ ఈ యాక్షన్ సినిమాను తెరకెక్కిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. ఈ స్పెషల్ డే సందర్భంగా తలా అజిత్ కు తుపాకీ మీడియా తరపున జన్మదిన శుభాకాంక్షలు!

# ప్రభాస్ తో సినిమా అంటే ఆరేళ్లకి పైగా ఆగాల్సిందే!



ప్రభాస్ .. ఇప్పుడు బాలీవుడ్ హీరోలను సైతం కంగారు పెడుతున్న పేరు. బడా ప్రొడ్యూసర్లను .. డైరెక్టర్లను తన చుట్టూ తిప్పుకుంటున్న పేరు. ఒక్క మాటలో చెప్పాలంటే సినిమా మార్కెట్లో మంత్రంలా మ్రోగుతున్న పేరు. అలాంటి ప్రభాస్ తో ఒక సినిమా చేయాలనే ఆశ .. ఆసక్తి .. ఉత్సాహం స్టార్ డైరెక్టర్ ల నుంచి కొత్త దర్శకుల వరకూ ఉంటుంది. ఏ జోనర్లో ఏ కథను రాసుకున్నా పాన్ ఇండియా సెట్ల మధ్య పట్టుకుని ఆయనకు కథ వినిపించడం చాలా కష్టమైన పని. ఒకప్పుడు ప్రభాస్ సినిమా తీయడం ఎంత కష్టమో .. ఇప్పుడు ఆయనకి కథ వినిపించడానికే అంత కష్టపడవలసి ఉంటుంది.ఒకవేళ అదృష్టం బాగుండి ప్రభాస్ ని వెంటనే కలిసి కథ చెప్పే అవకాశం దొరికినా ఆయన ఏమంటాడో తెలియదు. ఓకే అంటే మాత్రం ఆయనను కెమెరా ముందుకు తీసుకురావడానికి ఆరేళ్లకు పైనే పడుతుంది. అందుకు కారణం ఆల్రెడీ ఆయన చేతిలో ఓ నాలుగు పాన్ ఇండియా సినిమాలు ఉండటమే. గతంలో ప్రభాస్ చేసిన బాహుబలి .. బాహుబలి 2 .. సాహో పాన్ ఇండియా సినిమాలే. నిర్మాణం పరంగా ఎక్కువ సమయం తీసుకోవడం వలన అవి చాలా గ్యాప్ తో థియేటర్లకు వచ్చాయి. సాహో విడుదలై కూడా దాదాపు రెండేళ్లు కావొస్తోంది .. ఇంతవరకూ రాధేశ్యామ్ రంగంలోకి దిగనేలేదు.ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ సలార్ చేస్తున్నాడు. ఇటీవలే ఈ సినిమా సెట్స్ పైకి వెళ్లింది కనుక విడుదల అనే మాట వచ్చే ఏడాదిలో వినవలసిందే. ఆ తరువాత ఓంరౌత్ దర్శకత్వంలో ఆది పురుష్ నడుస్తుంది .. ఇది రామాయణానికి దృశ్యకావ్యం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇంతవరకూ తెరకెక్కిన పౌరాణిక చిత్రాలకి ఇది తాతలాంటిదని చెబుతున్నారు. దీని నిర్మాణానికి రెండేళ్లు పట్టినా ఆశ్చర్యం లేదు. ఆ తరువాత నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సైన్స్ ఫిక్షన్ రూపొందనుంది. దీని కథా పరిధి చాలా విస్తృతమైనది. ఆ వెంటనే సిద్ధార్థ్ ఆనంద్ పాన్ ఇండియా ప్రాజెక్టు ఉండనే ఉంది. కనుక ఆ తరువాత సినిమా చేయాలనుకున్నవాళ్లు ఆరేళ్లకి పైగా అలా వెయిట్ చేస్తూ ఉండవలసిందే!

# పుష్ప రిలీజ్ పై క్రేజీ అప్డేట్..!

ప్రస్తుతం కరోనా కారణంగా టాలీవుడ్ సినిమాలన్ని విడుదల తేదీలను వాయిదా వేసుకుంటున్నాయి. ఎందుకంటే షూటింగ్స్ అనుకున్న షెడ్యూల్లో జరిగితే ఇదివరకు ప్రకటించిన తేదీలలో సినిమాలు రిలీజ్ అయ్యేవి. కానీ ఓవైపు కరోనా విలయతాండవం చేస్తుండటంతో జనాలంతా ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని బ్రతుకుతున్నారు. అలాగే మేకర్స్ కూడా అన్ని సర్దేసి ఎవరిళ్లకు వారు చేరుకున్నారు. ఇలాంటి తరుణంలో సినిమా రిలీజ్ గురించి మాట్లాడుకోవడం కరెక్ట్ కాదని అందరూ సైలెంట్ అయిపోయారు. కానీ సినిమాలకు సంబంధించిన రూమర్స్ మాత్రం మేకర్స్ చెప్పకపోయినా వైరల్ అవుతూనే ఉంటాయి. ప్రస్తుతం స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ - సుకుమార్ కాంబినేషన్ లో పుష్ప సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే.అయితే పాన్ ఇండియా సినిమాగా రూపొందుతున్న పుష్ప సినిమాను ఇదివరకు మేకర్స్.. ఈ ఏడాది ఆగష్టు 13న రిలీజ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. కానీ ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా లేవు కాబట్టి సినిమాను వాయిదా వేసే ఆలోచనలో ఉన్నట్లు టాక్ నడుస్తుంది. అదికూడా పుష్ప సినిమాను మేకర్స్ డిసెంబర్ నెలకు షిఫ్ట్ చేస్తున్నారని.. ఒకవేళ ఇప్పుడు రిలీజ్ కు సిద్ధంగా ఉన్నటువంటి సినిమా కరెక్ట్ టైంకు రిలీజ్ అయితే మాత్రం పుష్ప.. దసరాకు వచ్చే అవకాశం ఉందని పుకార్లు వైరల్ అవుతున్నాయి. మరికొన్ని కథనాలేమో పుష్ప వచ్చే ఏడాది సంక్రాంతికి రాబోతుందని చెబుతున్నాయి.




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**